హనుమంత.. భక్తుల పులకింత


దేవస్థానం ప్రాంగణంలో కథాకళి కళాకారుల నృత్యాలు




శ్రీవారికి అభిషేకం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం వేంకటాద్రి రాయుడు హనుమంత వాహనంపై ఊరేగారు. స్వామి కోదండరామ అలంకారణలో భక్తులను కటాక్షించారు. వాడపల్లి తిరువీధుల్లో వాహనసేవ కొనసాగింది. పండితుడు రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, లక్ష తులసి పూజ, నవగ్రహ హోమం జరిగాయి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సూర్యచక్రధరరావు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ● గురువారం తిరుప్పావడ సేవ, యోగ నారసింహ అలంకారంలో సింహ వాహన సేవ ఉంటాయి.

మలేషియా యాత్ర.. మేలెంత!

ప్రతినిధుల ఎంపికలో జేఎన్‌టీయూకే పోకడపై చర్చ



ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, గాంధీనగర్: కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూకే)లో తీసుకునే కొన్ని నిర్ణయాలు తరచూ వివాదాస్పదమవుతున్నాయి. 'సాంకేతికత- నాయకత్వం' అంశంపై మలేషియాలో జరుగుతున్న ఐదు రోజుల కార్యశాలకు నిపుణులైన ఆచార్యులు, కీలక విభాగాధిపతులు, నాయకత్వ అర్హత ఉన్నవారిని కాకుండా నచ్చినవారిని పంపించినట్లు తెలుస్తోంది. రూ.లక్షలు పోసి ఏదో విహార యాత్రకు అన్నట్లుగా ఈ ఎంపికలు ఉన్నాయని.. పాలక మండలి అనుమతితో ఇది సాగలేదంటూ ఇన్‌ఛార్జి వీసీ నిర్ణయాన్ని జేఎన్‌టీయూ వర్గాలే తప్పుపడుతున్నాయి. దీంతో మలేషియా పర్యటనతో ఈ విశ్వవిద్యాలయానికి మేలెంత..? అనే అంశం తెరమీదికి వచ్చింది.

అందివచ్చిన అవకాశం..

జేఎన్‌టీయూ విభాగాధిపతులు, బోధన సిబ్బంది.. వారి బోధన, పాలనా విధానాల్లో ఆధునిక ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకుని మెరుగైన కార్యకలాపాలు సాగించాల్సి ఉంది. ఇందుకు వీలుగా మలేకా మలేషియా సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఈనెల 20 నుంచి 25 వరకు కార్యశాల నడుస్తోంది. జేఎన్‌టీయూకే నుంచి 13 మంది ప్రతినిధులను పంపారు. రిజిస్ట్రార్, రెక్టార్, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌తో పాటు భవిష్యత్తులో నాయకత్వం వహించబోయే ప్రతినిధులను పంపితే ఫలితం ఉంటుందని, కొందరిని సంతృప్తిపరచడానికి దిగువ స్థాయి సిబ్బందినీ, కార్యాలయ సహాయకులను భాగస్వాములను చేశారన్న వాదన వినిపిస్తోంది. జేఎన్‌టీయూ వైస్ ప్రిన్సిపల్ ఎం.స్వరూపారాణి సారథ్యంలో.. ఇంటర్నేషనల్ రిలేషన్స్ గౌరవ సలహాదారు ఎస్కే సులేమాన్ మార్గదర్శకత్వంలో బృందం మలేషియా వెళ్లింది. వీసీఈ చీఫ్ ఇంజినీరు, ఎస్ఎంఎస్ డైరెక్టర్, మెకానికల్ వైస్ ప్రిన్సిపల్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్రంథ పాలకులు, వ్యాయామ విద్య అసిస్టెంట్ ప్రొఫెసర్, జాయింట్ రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్, టైపిస్ట్ ఉన్నారు. ఒక్కొక్కరికీ రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల వరకు యూనివర్సిటీ నిధులు భరిస్తున్నప్పుడు అందరి ఆమోదంతో ప్రతినిధులను ఎంపికచేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

అన్ని విభాగాల అభివృద్ధి కోసమే..

జేఎన్‌టీయూకే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతోనే మలేషియా పర్యటనకు 13 మందిని పంపించాము. ఉత్తమమైనది అధ్యయనం చేయడం.. ఏఐ టెక్నాలజీ ఉపయోగించి వ్యవస్థను సమర్థంగా ఎలా నడపాలో నేర్చుకునే అవకాశం దక్కుతుంది. అందుకే గ్రంథాలయం, స్పోర్ట్స్-క్రీడా ప్రతినిధులనూ పంపాము. మరుగుదొడ్ల శుభ్రం చేసే విభాగం హెడ్ సార్జంట్‌ను పాస్‌పోర్టు లేక పంపించలేకపోయాం. విద్యాలయానికి తగిన గుర్తింపు దక్కాలంటే అన్ని విభాగాలూ ముఖ్యమే. -మురళీకృష్ణ, ఇన్‌ఛార్జి వీసీ, జేఎన్‌టీయూకే

నవ్య ప్రణాళికలు.. పారిశ్రామిక వెలుగులు


పెట్టుబడుల ఆకర్షణ.. ఉపాధి అవకాశాలు పెంచేలా కసరత్తు











ఇవీ క్లస్టర్లు.. ఉపాధికి నిచ్చెనలు

◆ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరంలో పప్పుదినుసుల ఉత్పత్తుల క్లస్టర్ నడుస్తోంది. తాజాగా రూ.10 కోట్ల చొప్పున పెట్టుబడులతో మండపేటలో జ్యూయలరీ, పరుపులు.. మామిడికుదురు, మలికిపురంలో కోకోనట్ విలువ ఆధారిత క్లస్టర్లు, ఆత్రేయపురంలో పూతరేకులు, పచ్చళ్ల క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

◆ తూర్పుగోదావరి జిల్లాలోని రంగంపేటలో ఫర్నిచర్, రాజానగరం మండలంలో సిరామిక్, గ్రానైట్ క్రూసిబుల్ (బంగారు నగలు కరిగించే పరికరాలు).. కడియం మండలంలో టెక్స్‌టైల్స్, చాగల్లు ప్రాంతంలో జీడిపిక్కల క్లస్టర్ల ఏర్పాటుకు కసరత్తు సాగుతోంది.

◆ కాకినాడ జిల్లా రమణయ్యపేటలో ప్రింటింగ్, గండేపల్లి మండలం సూరంపాలెంలో పాలిమర్స్, కాకినాడ పోర్టు ప్రాంతంలో రైస్ మిల్లింగ్, మరికొన్ని ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లకు ప్రతిపాదించారు.

■ కాకినాడ, తూర్పు, కోనసీమ జిల్లాలు వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు.. బియ్యం, పప్పు మిల్లులు, ఎడిబుల్ ఆయిల్, సుగర్, ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, పొటాటో చిప్స్, బిస్కట్లు, బేకరీ వంటి ఉత్పత్తుల పరిశ్రమలకు ఆస్కారం ఉంది. తాండ్ర, నూడిల్స్, పచ్చళ్లు, జీడిపిక్కలు, పౌల్ట్రీ, పశు దాణా పరిశ్రమలూ సరేసరి. సంప్రదాయ వంటకాలు, మిఠాయిల తయారీ రంగాల్లోనూ రాణించే వీలుంది.

అవకాశాలు అందిపుచ్చుకుంటే..

■ ఇటుకలు, సిరామిక్ టైల్స్, శానిటరీ సామగ్రి, ఆటోక్లేవ్ ఎయిరేటెడ్ బ్రిక్స్, ఫ్లైయాస్ బ్రిక్స్, రూఫ్ షీట్స్, ప్లాస్టిక్ బేస్డ్ రోడ్డు మెటల్, క్రాఫ్ట్ పేపర్, పాలిథిన్ పౌచ్‌లు, నార సంచులు.. పాఠశాలల/కార్యాలయాల బ్యాగులు, థర్మాకోల్ సంచులు, శానిటరీ నాప్‌కిన్లు, రెడీమేడ్ వస్త్రాల పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం. ■ జనరల్ ఇంజినీరింగ్ వర్క్స్, ఫ్యాబ్రికేషన్, రిగ్‌ల నిర్వహణ, బోట్/షిప్, ఫ్లోటింగ్ వెషల్స్ మరమ్మతుల పరిశ్రమలు ఏర్పాటుచేయొచ్చు.

భూనిధి ఉంటే..

పరిశ్రమల ఏర్పాటుకు నిర్దేశించిన భూములను వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీలకు మళ్లించింది. ఎక్కడా భూ బ్యాంకు లేదు. కాకినాడ జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో 95.04 ఎకరాలు మాత్రమే ప్లాట్ల రూపంలో ఖాళీగా ఉంది. ప్రభుత్వం నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. భూములను నియోజకవర్గాల వారీ కేటాయించాలి.

ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక చిత్రమిదీ..

జిల్లా	భారీ-మధ్య తరహా	ఉపాధి	ఎంఎస్ ఎంఈలు	ఉపాధి
కాకినాడ	62	32,227	13,725	53,027
తూర్పుగోదావరి	38	19,946	31,056	1,00,815
అంబేడ్కర్ కోనసీమ	7	2,360	10,600	21,000

ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్

అపార వనరులకు ఉమ్మడి తూర్పుగోదావరిలో కొదవలేదు. ధాన్యగర్భ ఇది.. సువిశాల సాగర తీరం.. గోదావరి పరివాహకం.. చమురు- సహజ వాయు నిక్షేపాలు.. సారవంత భూములు ఉన్నాయి. ఇక్కడి వనరులు సద్వినియోగం చేసుకుంటే ప్రగతి పరుగులు తీయడం కష్టమేమీ కాదు. పరిశ్రమల ఏర్పాటు, ఉపాధికీ ఆస్కారం ఎక్కువే. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో స్తబ్దత నెలకొంది. కూటమి ప్రభుత్వ రాకతో సానుకూల పరిస్థితి ఏర్పడడం.. నూతన పారిశ్రామిక పాలసీకి కసరత్తు చేస్తుండడంతో ప్రస్తుతం ఉత్సాహ వాతావరణం నెలకొంది.

క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదన



అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి, ఆహార ఇతర క్లస్టర్ల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఔత్సాహికులను ప్రోత్సహించేలా క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నాం. భూనిధి లేకపోవడం సమస్య. నియోజకవర్గానికి కనీసం 30 నుంచి 35 ఎకరాల భూమి కేటాయిస్తే పారిశ్రామికంగా మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. - పి.కె.పి.ప్రసాద్, పరిశ్రమల శాఖ అధికారి, కోనసీమ జిల్లా

తుపానుతో పలు రైళ్ల రద్దు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): దానా తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. దీంతో బుధవారం తూర్పుగోదావరి జిల్లా మీదుగా రాకపోకలు సాగించే 34 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపోయాయి. వీటిలో దూరప్రాంత సర్వీసులు ఎక్కువగా ఉన్నాయి. ఈ నెల 25 వరకు ప్రయాణించే పరిస్థితి లేదని చెబుతున్నారు. అక్టోబర్ 14, 24, 20 రైళ్ల రద్దు కారణంగా ఇక్కడి నుంచి విజయవాడ, సికింద్రాబాద్ వైపు, ఇటు విశాఖపట్నం వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిడదవోలు, రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్లతోపాటు కాకినాడ జిల్లా పరిధిలోని తుని, సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సహాయ కేంద్రాలు(హెల్ప్‌డెస్క్‌లు) ఏర్పాటు చేశారు. 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

హెల్ప్‌డెస్క్‌ల ఫోన్ నంబర్లు ఇవి..
రాజమహేంద్రవరం: 0883 2420541
నిడదవోలు: 0881 3223325
తుని: 0885 4252172
సామర్లకోట: 8842327010

వాలంటీరు హత్యకేసులో ఆ నలుగురు ఎక్కడ?

పోలీసుల ముమ్మర గాలింపు

ఈనాడు, అమలాపురం; న్యూస్‌టుడే, ముమ్మిడివరం: అయినవిల్లికి చెందిన వాలంటీర్, దళిత యువకుడు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో మరో నలుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరిలో ఇద్దరికి మరికొన్ని హత్యానేరాలతో సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ కేసుల వివరాలూ బయటకు తీస్తున్నారు. దుర్గాప్రసాద్ హత్య జరిగిన తరువాత 2022 సెప్టెంబరులో ముమ్మిడివరం మండలం అనాతవరంలోనూ ఓ ఘటన జరిగింది. ఓ దళిత యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి సమీపంలోని పంట బోదెలో పడేశారు. దుర్గాప్రసాద్ హత్యోదంతంలో పాల్గొన్న నిందితుల్లో ఇద్దరికీ ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ముమ్మిడివరానికి చెందిన వైకాపా నాయకుడిని విచారణకు తీసుకెళ్లిన పోలీసులు, కొన్ని వివరాలు సేకరించి విడిచిపెట్టారు. అనుమానితులను విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. వాలంటీరు ఉదంతంలో ప్రధాన నిందితుడు పినిపే శ్రీకాంత్‌తో పాటు, ఇతర నిందితులతో ఎక్కువ దఫాలు ఫోన్‌లో మాట్లాడిన వారి వివరాలు సేకరిస్తున్నారు. కొద్ది రోజుల్లోనే నిందితులందరినీ అరెస్టు చేస్తామన్నారు.

కుమారుడిని కలిసిన విశ్వరూప్

రాజమహేంద్రవరం నేరవార్తలు: వాలంటీరు హత్యకేసులో అరెస్టయి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న శ్రీకాంత్‌ను బుధవారం తండ్రి, మాజీ మంత్రి విశ్వరూప్ ములాఖత్‌లో కలిశారు. వ్యక్తిగత న్యాయవాదితో కలిసి వెళ్లిన విశ్వరూప్ కుమారుడితో 30 నిమిషాలపాటు మాట్లాడారు. కాగా శ్రీకాంత్‌ను మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు కారాగారానికి తీసుకొచ్చి అప్పగించారని డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.విజయకుమార్ తెలిపారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న జేసీ నిశాంతి

మార్గదర్శకాల మేరకు ధాన్యం సేకరణ

ముమ్మిడివరం: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించడానికి సిద్ధం కావాలని సంయుక్త కలెక్టర్ టి.నిశాంతి సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు జేసీ హాజరై పలు సూచనలు చేశారు. కల్లాల్లోని ధాన్యం తేమ, నూక శాతం కనుగొనే సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలన్నారు. గతంలో మాదిరి కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద తేమ శాతంలో వ్యత్యాసానికి అవకాశం లేకుండా.. సంబంధిత పరికరాలు సిద్ధం చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వెళ్లే వరకు జీపీఎస్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో 376 రైతు సేవా కేంద్రాలను 219 క్లస్టర్లుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్లస్టర్‌కు ఒక్కొక్కరు చొప్పున డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సాంకేతిక సహాయకులు, 66 మంది సహాయకులను నియమించామన్నారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు బాల సరస్వతి, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

మీ ఆధార్ వివరాలు.. సరిగా ఉన్నాయా..?

☛ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు
☛ మార్పులు, చేర్పులకు అవకాశం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందాలన్నా.. విద్య, ఉద్యోగ పోటీ పరీక్షలు రాయాలన్నా.. విద్యాలయాల్లో చేరాలన్నా.. చివరకు ప్రయాణం చేయాలన్నా.. ఆధార్ కార్డు ఉండాల్సిందే. ఇందులో ఏ చిన్న తప్పిదం ఉన్నా, తిరస్కరణకు గురవుతుంది. వేలిముద్రలు సరిపోలక పోవడం.. ఐరిస్ సమస్యలు వంటివి ఎదురవుతున్నాయి. వీటి పరిష్కారానికి ఆధార్ నవీకరణ అవసరం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల 25వ తేదీ వరకు సంచార ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసింది.

జిల్లా గణాంకాలు
గ్రామ సచివాలయాలు 467
వార్డు సచివాలయాలు 48
ఆధార్ నవీకరించుకోవాల్సిన వారు: 2.10 లక్షలు


ముమ్మిడివరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆధార్ నవీకరించుకుంటున్న విద్యార్థులు

జిల్లాలో ఇలా..

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఉన్నచోట కాకుండా ఇతర ప్రాంతాల్లో సంచార కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి యంత్ర సామగ్రి తరలించడానికి రూ.500, శిబిరం నిర్వహణకు రూ.1000 చొప్పున ప్రభుత్వం కేటాయించింది. వీటిని పురపాలక సంఘాల్లో కమిషనర్లు, మండల స్థాయిలో ఎంపీడీఓలు పర్యవేక్షిస్తున్నారు.

రుసుముల వివరాలు

చిన్నారులకు సంబంధించి కొత్త ఆధార్ నమోదుకు రుసుం అవసరం లేదు. 5-7, 15-17 ఏళ్ల మధ్య బాలబాలికలు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవడానికి ఉచిత సేవలు కల్పించారు. 7 నుంచి 17 ఏళ్ల మధ్య వారి వేలిముద్రల నవీకరణకు రూ.100 రుసుం చెల్లించాలి. ఆధార్‌తో చరవాణి లింక్, ఈ-మెయిల్ లింక్, డాక్యుమెంట్లు అప్‌డేట్, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, లింగం మార్పు చేసుకోవడానికి రూ.50 వసూలు చేస్తారు. పొటో, బయోమెట్రిక్, ఐరిష్‌ల మార్పునకు రూ.100 చెల్లించాలి.

వినియోగించుకోవాలి

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సంచార ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆధార్ పత్రాలు తీసుకుని కేంద్రాలకు వెళ్లి వాటిలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. -విజయ్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్

కొబ్బరి కాయల వేలంలో రికార్డుస్థాయి ధర



అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట ఉద్యాన (కొబ్బరి) పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు ఆధ్వర్యంలో బుధవారం కొబ్బరి కాయల వేలంపాటలు నిర్వహించారు. షరతుల మేరకు 19 మంది పాటదారులు ఒక్కొక్కరూ రూ.10 వేలు చొప్పున డీడీలు తీశారు. అంబాజీపేటకు చెందిన మానే చంద్రశేఖర్ వెయ్యి కొబ్బరికాయలు రూ.19,400 చొప్పున మొత్తం 30 వేల కొబ్బరికాయలను వేలంలో రూ.5,82,000కు దక్కించుకున్నారు. ఇది ఉద్యాన పరిశోధన కేంద్రం చరిత్రలోనే అరుదైన రికార్డుగా రైతులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1955లో అంబాజీపేటలో కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయగా, ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి కొబ్బరి కాయల వేలం నిర్వహిస్తుంటారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఆర్డీవో కె.మాధవి, పక్కన డీఎస్పీ ప్రసాద్

అమలాపురం పట్టణం: బాణసంచా విక్రయాల్లో భద్రత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ ప్రసాద్ ఆదేశించారు. అమలాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులు, విక్రయదారులతో ఆర్డీవో కె.మాధవి బుధవారం సమావేశం నిర్వహించారు. సబ్‌డివిజన్ పరిధిలోని రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, కార్మిక శాఖ అధికారులతో బాణసంచా తయారీ, విక్రయాలపై సమీక్ష చేశారు. తయారీ కేంద్రంలో వృద్ధులు, మహిళలు, బాలలతో పనిచేయించకూడదన్నారు. శిక్షణ పొందిన కార్మికులను మాత్రమే నియమించుకోవాలని సూచించారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, పోలీసులు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

మొండికేశారు.. రోడ్డుకీడ్చారు

మండపేట: మండపేటలో మున్సిపల్ దుకాణ సముదాయంలో కొందరు వ్యాపారులు ఎనిమిదేళ్లుగా అద్దె చెల్లించకుండా దుకాణాలు ఖాళీ చేసి వెళ్లిపోయారు. బకాయిలు వసూలు చేసేందుకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు కొత్త ఎత్తుగడ వేశారు. దుకాణం నంబరు.. బకాయి దారుడి పేరు, చెల్లించాల్సిన మొత్తం ఫ్లెక్సీగా ముద్రించి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. 82 మంది వడ్డీతో కలిపి రూ.3.9 కోట్లకు పైగా ఉన్నట్లు ముద్రించి ప్రదర్శించారు.


కరాచి సెంటరులో బకాయిదారుల వివరాలతో ఫ్లెక్సీ

10 లక్షల పీత పిల్లల ఉత్పత్తి లక్ష్యం

హేచరీ నిర్మాణానికి స్థల పరిశీలన

కాట్రేనికోన, న్యూస్‌టుడే: చిర్రయానాం సముద్రతీరం సమీపంలో ఏపీ మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పీతల హేచరీకి అమలాపురం ఆర్డీవో కె.మాధవి బుధవారం స్థల పరిశీలన చేశారు. సర్వే నం.1లో ఉన్న అయిదు ఎకరాల భూమిని, సంబంధిత దస్త్రాలను పరిశీలించారు. మత్స్యశాఖ జేడీ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా పరిసర ప్రాంతాల్లో పీతల సీడ్ తగినంత లభ్యం కావడం లేదన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు స్థానికంగా అయిదు ఎకరాల్లో రూ.2.75 కోట్లతో హేచరీ నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. బ్యాచ్‌కు 1.25 లక్షల చొప్పుడు ఎనిమిది బ్యాచ్‌లలో ఏడాదికి 10 లక్షల పీత పిల్లల ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పారు. తహసీల్దారు సునీల్‌కుమార్, ఎఫ్‌డీవో గోపాలకృష్ణ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

29 నుంచి క్రీడాకారుల ఎంపికలు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలకు సంబంధించి అమలాపురంలోని జనుపల్లి బాలయోగి స్టేడియంలో ఈ నెల 29, 30 తేదీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి పి.ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. క్రీడల్లో పాల్గొనేవారు తమను సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. 19 క్రీడలకు సంబంధించి నవంబరు 6, 7, 9 తేదీల్లో విజయవాడ, గుంటూరులలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు.

పాఠశాలలకు నిధులొచ్చాయ్

కాంపోజిట్ గ్రాంటు విడుదల చేస్తూ ఉత్తర్వులు

పామర్రు, రామచంద్రపురం, న్యూస్‌టుడే: గత నాలుగేళ్లుగా పాఠశాలల్లో సుద్దముక్క కొనుగోలుకూ నిధులు రాక ప్రధానోపాధ్యాయులు చేతి చమురు వదిలించుకుంటున్నారు. మండల వనరుల కేంద్రాల నిర్వహణకూ నిధులు రాక ఎంఈవోలు నానా పాట్లు పడేవారు. దీనిపై స్పందించిన కూటమి ప్రభుత్వం నిధులు మంజూరుకు ఆదేశాలు ఇచ్చింది. 50 శాతం నిధులు వెంటనే విడుదల చేస్తున్నట్లు, మిగిలినవి త్వరలో ఇస్తామని పేర్కొంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1545 పాఠశాలలకు రూ.3.50 కోట్లు కేటాయించగా రూ.1.75కోట్లు విడుదల య్యాయి. రెండు, మూడు రోజుల్లో ఇవి సంబంధిత పాఠశాలల యాజమాన్య సంఘాల ఖాతాలకు జమవుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఇవీ వివరాలు...

జిల్లాలోని పాఠశాలల వనరుల అభివృద్ధికి, గుణాత్మక విద్య పెంపొందించడానికి పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంటును సమగ్ర శిక్ష నుంచి మంజూరు ఇస్తుంటారు. 2021-22 తరువాత ఈ నిధులు విడుదల కాలేదు. వీటితో పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పన, చిన్న చిన్న మరమ్మతులు, విద్యార్థుల్లో గుణాత్మక విద్య పెంపొందించడానికి అవసరం అయిన బోధనోపకరణాల తయారీ తదితరాల కోసం ఈ గ్రాంటును వినియోగించుకోవచ్చు. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యను బట్టి గ్రాంటు మంజూరు చేశారు. పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాలు, జూనియర్ కళాశాలలు, వివిధ సొసైటీల ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలను ప్రస్తుతం గ్రాంటు మంజూరు నుంచి మినహాయించారు. వాటికి వేరే విధంగా నిధులు విడుదలవుతాయన్న కారణంతో దీన్ని ఆపారు. పాఠశాలల గ్రాంటు మంజూరు వివరాలు ఇలా ఉన్నాయి.

పాఠశాలలు 1545
మంజూరైన నిధులు రూ.3.50 కోట్లు
విడుదలైన నిధులు రూ.1.75 కోట్లు

నిధుల మంజూరు ఇలా..

విద్యార్థుల సంఖ్య	నిధులు (రూ.వేలల్లో..)
1-30	10
31-100	25
101-250	50
251-1000	75
1000 మందికి పైగా	రూ.లక్ష

మండల వనరుల కేంద్రానికి

మండల వనరుల కేంద్రాల్లో నిర్వహణ, బోధనోపకరణాల తయారీ, సమావేశాల నిర్వహణకు ఒక్కొక్క దానికి రూ.30,000 చొప్పున, కంటింజెంటు గ్రాంటుగా రూ.40వేలు విడుదల చేశారు. ఈ రకంగా కోనసీమ జిల్లాలో 22 కేంద్రాలకు రూ.28.60లక్షలు మొత్తం రూ.80.60 లక్షలు విడుదల చేశారు.

రైలొస్తే.. అంతే..


సామర్లకోట రైల్వేస్టేషన్‌లో 2, 3 ప్లాట్‌ఫామ్‌ల మధ్యలో పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

రైలు దిగిన ప్రయాణికులు పట్టాలు దాటడం ప్రమాదకరమని తెలిసినా కొందరు నిర్లక్ష్యం వీడడం లేదు. ఇటు నుంచి అటు కొందరు, అటు నుంచి ఇటు మరికొందరు సామర్లకోట జంక్షన్ రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతున్నారు. స్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి రెండు, మూడు ప్లాట్‌ఫామ్‌లకు, రెండు, మూడు నుంచి ఒకటో నంబరుకు వెళ్లేందుకు మెట్ల వంతెన ఉన్నా.. అది దూరంలో ఉందని భావించి పట్టాలు దాటేందుకే ఆసక్తి చూపుతున్నారు. అలాంటి వారిని నిలువరించి జాగ్రత్తలు సూచించాల్సిన అధికారులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. పట్టాలు దాటుతుండగా రైలొస్తే పరిస్థితి ఏంటనేది ఆలోచించాలి.

- న్యూస్‌టుడే, పెద్దాపురం, సామర్లకోట

మద్యం దుకాణంతో చింతే..

అల్లవరం మండలం గోపాయిలంక వెళ్లే రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ గ్రామస్థులు వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే ఆనందరావు చిత్రాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిపై స్వచ్ఛభారత్.. ఈ రోడ్డుపై మద్యం దుకాణం మాకు వద్దు అని రాశారు.

-న్యూస్‌టుడే, అల్లవరం



అల్లవరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

గోదారి చెంతే.. నీటి కష్టాలింతే..

గోదావరి ఏటిగట్టున పలు ఎత్తిపోతల పథకాలున్నా సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నంలో గత కొద్దిరోజులుగా తాగునీటి సమస్య తలెత్తి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ రక్షిత పథకం నుంచి వచ్చే పైపులైను మరమ్మతులకు గురవడం, సత్యసాయి గోదావరి జలాల ప్రాజెక్టు మరమ్మతులు చేయడంతో తాగునీటికి కటకటలాడుతున్నామని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. వీధుల్లో ప్లాస్టిక్ డ్రమ్ములు కొనుక్కుని ఇంటి ముందు ఉంచితే ట్యాంకర్ వచ్చి నీళ్లు నింపుతోందని.. తాగడానికి, వాడుకకు అదే నీటిని వాడుకుంటున్నామని వాపోతున్నారు. ప్లాస్టిక్ డ్రమ్ములు లేకపోతే నీరు కూడా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 మీటర్ల దూరంలోనే గోదావరి నది కనిపిస్తున్నా తాగేందుకు నీరు లేక అల్లాడుతున్నామని కుటుంబాలు బాధ వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందంటున్నారు. పంచాయతీ కార్యదర్శి సరోజినీ రాణి వేరే పంచాయతీకి బదిలీపై వెళ్లారు. పెదకొండేపూడికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ పోసియ్యదొరను ఇన్‌ఛార్జిగా నియమించినా ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు.

- న్యూస్‌టుడే, సీతానగరం


పురుషోత్తపట్నంలో ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా..

శ్రీవారికి 108 వెండి గిన్నెల వితరణ

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాసంలో జరిగే కూడారై ఉత్సవంలో ఆండాళ్ అమ్మవారికి పాయసం నివేదన చేసేందుకు దేవస్థానం 2019-24 పాలకమండలి బుధవారం రూ.10 లక్షల విలువైన 108 వెండి గిన్నెలు ఆలయానికి బహూకరించింది. మాజీ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సభ్యులు పెన్మత్స సురేష్‌రాజు, రెడ్డి రవిదేవి, మన్యం వెంకటనాగసూర్యకుమారిభాను, శెనగన సత్యనారాయణ, రొట్టే రాజేశ్వరి, కొపనాతి శారదాంబ, మెర్ల వెంకటేశ్వరరావు, ఏపుగంటి కనకరావు, వాడపల్లి వెంకటసత్యసాయి వీటిని సమకూర్చి దేవస్థానంలో చక్రధరరావుకు అందజేశారు. వీటికి అర్చకులు సంప్రోక్షణ జరిపి స్వామివారి సన్నిధిలో ఉంచారు.


అధికారులకు వెండి గిన్నెలు అందజేస్తూ...

సిద్ధివినాయక దర్శనానికి ఏర్పాట్లు

అయినవిల్లి, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో సిద్ధి వినాయకస్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు, 3 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారిని భక్తులు దర్శించుకునే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఈవో సత్యనారాయణరాజు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత అన్నదానం నిర్వహిస్తామన్నారు.


సిద్ధివినాయకస్వామి

28న ఈపీఎఫ్‌వో 'నిధి ఆప్‌కే నికత్'

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఆయా జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికత్' శిబిరాలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ వై.డి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జగ్గంపేటలోని ఎస్.ఎస్.విద్యావిహార్ వద్ద నిధిఆప్‌కే నికత్ జరుగుతుందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి తాళ్లరేవు పీఏసీఎస్, కాకినాడ జిల్లాకు సంబంధించి బెండపూడిలో ఎస్.ఎస్.విద్యావిహార్, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఉండి ఎల్ఎస్‌సీఎస్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి వై.రామవరం మండలం యార్లగడ్డ ఏజీ బాలికల ఉన్నత పాఠశాల, గంగవరం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మారేడుమిల్లి మండలంలోని కేజీబీవీ స్కూల్ వద్ద నిధి ఆప్‌కే నికత్ శిబిరాలు జరుగుతాయని తెలిపారు. సభ్యుల సేవలు, ఫిర్యాదుల పరిష్కారాలు నేపథ్యంలో నిర్వహించే ఈ శిబిరాల్లో ఆయా జిల్లాల పరిధిలోని పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారులతోపాటు ఎస్టాబ్లిష్‌మెంట్లు పాల్గొని ఫిర్యాదులు అందించవచ్చని, పింఛనుదారులు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించవచ్చని సహాయ పీఎఫ్ కమిషనర్ తెలిపారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు అడుగులు

పామర్రు, న్యూస్‌టుడే: కేజీ నుంచి పీజీ వరకూ విద్యార్థుల వ్యక్తిగత సమాచారంతో కూడిన అపార్ కార్డుల జారీ, విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దడానికి బడి వైపు ఒక అడుగు పేరుతో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించడానికి విద్యాశాఖ సమాయత్తమైంది. అందులో భాగంగా బుధవారం జిల్లాలోని అన్ని మండలాల్లో ఆర్‌జేడీ, డీఈవో, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులతో దూర మాధ్యమ సమావేశాన్ని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. ప్రతి విద్యార్థికి కూడా ఆధార్ కార్డు వలే అపార్ కార్డులు జారీ అవుతాయని, 17 సంఖ్యలతో కూడిన ఈ కార్డులో వారు కేజీ నుంచి పీజీ వరకూ చదివిన పాఠశాలలు, కళాశాలలు, వారి విద్యకు సంబంధించిన అన్ని వివరాలు పొందుపరిచి ఉంటాయని తెలిపారు. అన్ని పాఠశాలల నుంచి తొలిదశలో 9,10 తరగతుల వారి వివరాలు వెంటనే సంబంధిత యూడైస్‌లో కచ్చితంగా పొందుపరచాలని సూచించారు. దశలవారీగా అన్ని పాఠశాలల్లోనూ ఇలా చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి తల్లిదండ్రుల నుంచి లిఖిత పూర్వకంగా సమ్మతి పత్రాలు పొందాలన్నారు. అదే విధంగా పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు అనే నినాదంతో బాలల దినోత్సవం రోజు(నవంబరు-14)న అన్ని పాఠశాలల్లోనూ మెగా తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించాలని, అందరినీ ఆహ్వానించాలని, వచ్చిన వారిని గౌరవించాలని, వారి బిడ్డల విద్యాప్రగతిని వివరించాలని, అందరు ఉపాధ్యాయులు వారికి కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.


దూరదృశ్య సమావేశంలో హెచ్‌ఎంలు, ఎంఈవో

రథం గుడి.. బాగుపడి..

న్యూస్‌టుడే, మండపేట

- జనార్దన అగస్త్యేశ్వరాలయానికి కొత్త సొబగులు
- రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు

మండపేట పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయమైన నవజనార్దన ఆలయాల్లో ఒకటైన భోజ జనార్దన స్వామి, అగస్త్యేశ్వరుడు ప్రతిష్ఠించిన పంచ అగస్త్యేశ్వరాలయాల్లో ఒకటిగా ఉన్న ఈ (రథంగుడి) ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ ఆలయ అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు కావడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు 200 మంది భక్తులు దర్శించుకుంటే పుణ్యతిథులు, పండుగలు, పర్వదినాలు, కార్తిక మాసం, ధనుర్మాసంలో భక్తుల సంఖ్య నాలుగైదు రెట్లు అధికంగా ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ ఆలయంలో 3 పురాతన ధ్వజ స్తంభాలు ఒరిగిపోవడంతోపాటు శిఖరాల మధ్య శ్లాబులు లీకేజి అవుతోంది.

ఎట్టకేలకు రూ. కోటి మంజూరు

ఇటీవల ఈ ఆలయం అభివృద్ధికి రూ.కోటి దేవాదాయ శాఖ మంజూరు చేసింది. ఈ నిధులతో ఆలయం గాలిగోపురానికి ఆగ్నేయంగా ఉన్న దుకాణాన్ని దానిని ఆనుకుని ఉన్న కార్యాలయ భవనాన్ని తొలగించి ప్రహరీ నిర్మించడం ద్వారా ఆలయం లోపలి భాగంలో విశాలంగా మారుతుంది. పురాతన నిర్మాణంలో మార్పులు చేయకుండా ఆలయ గోపురాల మధ్య ఉండే ముఖ మండపం శ్లాబు లీకేజి కాకుండా చర్యలు చేపట్టనున్నారు.

ఆదాయం... ఖర్చు ఇలా

జనార్దనస్వామి, అగస్త్యేశ్వరస్వామికి వేరువేరుగా 67.21 ఎకరాలు భూమి ఉండగా (శిస్తు) ఆదాయం ఏడాదికి రూ.19.70 లక్షలు వస్తుంది. రెండు దశాబ్దాల క్రితం రాజీవ్ గృహకల్ప నిర్మాణానికి 4 ఎకరాలు అగస్త్యేశ్వర స్వామి ఆలయ భూములు తీసుకున్నారు. ఆలయానికి వచ్చే ఆదాయంలో సిబ్బంది జీతభత్యాలకు రూ.12లక్షలు ఖర్చవుతుంది. మిగిలిన రూ.7.7లక్షలతో వివిధ రకాల పూజలు, కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తారు. అయితే ఆ నిధులు సరిపోవడం లేదు. మఠం వీధిలో పూల వనం కోసం భక్తులు ఇచ్చిన సుమారు రూ.కోటి విలువ చేసే 8సెంట్లు నిరుపయోగంగా ఉంది.


అభివృద్ధి చేయవలసిన రథం గుడి

అగస్త్యేశ్వరస్వామి, కైలాసేశ్వరస్వామి, జనార్దన స్వామి ఆలయాల పురాతన ధ్వజస్థంభాలు కొద్దిగా ఒరిగిపోయి ఉన్నాయి. వాటిని తొలగించి ధ్వజస్తంభాలకు మెరుగులు పెట్టించి మధ్యలో చెట్టు మాను ఏర్పాటు చేయనున్నారు. వీటికోసం కనీసం రూ.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

స్థపతి నిర్ణయం మేరకు మార్పులు

ఆలయ పవిత్రత దెబ్బతినకుండా ఎటువంటి మార్పులు చేయాల్సి వచ్చినా స్థపతి నిర్ణం మేరకు చర్యలు చేపడతాం. భారీ మార్పులు చేయాల్సి వస్తే పీఠాధిపతులను కూడా సంప్రదిస్తాం. ప్రస్తుతం ధ్వజస్తంభాలు, ప్రహరీ, శ్లాబులు మరమ్మతులు చేపడతాం. ఆలయ నిర్మాణంలో రథం మార్పుపై ఎటువంటి ప్రతిపాదన లేదు.

- కామేశ్వరరావు, కార్యనిర్వాహణ అధికారి, మండపేట

శైవ క్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కార్తికమాసం నేపథ్యంలో శైవక్షేత్రాలు, ఆలయాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు సూచించారు. వచ్చే నెల 2 నుంచి కార్తికమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఆలయాలకు చెందిన ఈవోలతో కాకినాడ డీసీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచారామ క్షేత్రాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, స్నానానికి నీటి సదుపాయంతోపాటు, ఉచిత దర్శనాలు తదితర ఏర్పాట్లపై ఆరా తీశారు. సోమవారాలు, ఏకాదశి, పౌర్ణమి వంటి పర్వదినాల్లో రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. స్నానఘట్టాల వద్ద రక్షణ చర్యలతోపాటు, మహిళల కోసం గదులు ఏర్పాటు చేయాలన్నారు. వేకువజామున 3గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ఆలయాలు తెరిచి ఉంచాలన్నారు. ప్రముఖ ఆలయాల్లో గర్భాలయ అభిషేకాలు నిలిపేయాలన్నారు. ప్రత్యేక మండపాలు, ఉత్సవ విగ్రహాలు పెట్టి అభిషేకాలు చేయాలన్నారు. దీపారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 31లోగా పనులు పూర్తి చేయాలన్నారు. కాకినాడ జిల్లా డీఈవో దుర్గాభవానీ, ఉమ్మడి జిల్లాకు చెందినఇన్‌స్పెక్టర్లు, ఈవోలు పాల్గొన్నారు.


ఈవోలతో ఏర్పాట్లపై చర్చిస్తున్న డీసీ రమేష్‌బాబు

కార్తికం వస్తున్నా.. ఎక్కడి చెత్త అక్కడే

ద్రాక్షారామ: ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ గ్రామానికి చెత్త సమస్య తీరని వేదనగా మిగులుతోంది. పుణ్యక్షేత్రం భీమేశ్వరాలయానికి కూతవేటు దూరంలోనే ఈ సమస్య ఉత్పన్నం కావడం మరీ ఇబ్బందిగా మారుతోంది. మేజరు పంచాయతీగా ఉన్న ఈ గ్రామంలో దాదాపు పదివేలు పైనే జనాభా నివసిస్తున్నారు. నిత్యం నాలుగైదు ట్రాక్టర్ల చెత్త ఉత్పన్నం అవుతుంది. కానీ ఈ చెత్తను డంప్ చేయడానికి సరైన యార్డు లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా శ్మశానవాటిక వెనుక ఉన్న డంపింగ్ యార్డులోనే చెత్తను వేస్తున్నారు. ఇది పూర్తిగా నిండిపోవడం వల్ల రోడ్డు పక్కన, శ్మశాన వాటిక బయట వేస్తున్నారు. దీని వల్ల పశువుల ఆసుపత్రి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్న ఈ రహదారి ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా ఉంటోందని గ్రామస్థులు వాపోతున్నారు.

భక్తులకు ఇక్కట్లే...

మరో వారం రోజుల్లో కార్తికమాసం వస్తుంది. పుణ్యక్షేత్రం భీమేశ్వరాలయానికి ప్రతినిత్యం వేలాది మంది భక్తులు ఈ రహదారి ద్వారానే ఆలయానికి చేరుకుంటారు. ఇలా దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు చెత్త స్వాగతం పలకడం వల్ల వారి మనోభావాలు దెబ్బతింటాయని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. ఇలా రోడ్డు పక్కన వేస్తున్న చెత్తను రెండు నెలలకు ఒకసారి వేలాది రూపాయలు ఖర్చు చేసి మళ్లీ జేసీబీతో ఎత్తించడం వల్ల రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా చెత్తను ఇకపై రోడ్డుపై వేయకుండా ఆదివారపుపేటలో వేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పంచాయతీ నుంచే కాకుండా ఆలయం వారు కూడా చెత్తను ఇక్కడ వేస్తున్నారు. ఇక్కడ చెత్త వేయకుండా వారికి కూడా సూచనలు చేస్తామన్నారు.


డంపింగ్ యార్డు బయట శ్మశాన వాటిక ఎదుట చెత్త

ట్యాంకు ఎక్కి నిరసన

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం ఏడిద జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో పెద్దచెరువు చుట్టూ స్థలం ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకోవడంతో వారికి పంచాయతీ కార్యదర్శి పుప్పాల శ్రీనివాస్ నోటీసులు జారీ చేశారు. దీంతో బుధవారం రామిశెట్టి శ్రీనివాస్ రక్షిత మంచి నీటి ట్యాంకు ఎక్కి తమకు న్యాయం చేయాలని లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆందోళన చేశాడు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం పెద్దచెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్కు అభివృద్ధికి తన సొంత నిధులు రూ.2.50కోట్లు ప్రకటించగా చెరువు చుట్టూ స్థలాన్ని ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకొన్న 46 కుటుంబాలకు డాక్యుమెంట్లు ఉంటే చూపించాలని మూడురోజుల క్రితం పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో యువకుడు శ్రీనివాస్ బుధవారం తమకు న్యాయం చేయాలని ట్యాంకుపైకి ఎక్కి నిరసన తెలిపారు. తాము ఎన్నో ఏళ్లుగా పంచాయతీ పన్నులు, కరెంటు బిల్లులు చెల్లిస్తూ చెరువు దగ్గర ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నామని, తమను ఖాళీ చేయమనడం అన్యాయమని బాధితులు ఆందోళన చెందుతున్నారన్నారు. మండపేట రూరల్ ఎస్సై డి.సురేష్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పంచాయతీ కార్యదర్శితో చర్చలు జరిపి న్యాయం చేస్తామని యువకుడితో మాట్లాడి ట్యాంకు నుంచి కిందకు దింపడంతో మూడు గంటల హైడ్రామాకు తెరపడింది. పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా చెరువు చుట్టూ స్థలం ఆక్రమించుకొని 46 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకునారన్నారు. వారందరికీ ఏవిధమైన పట్టాలు లేవని, ఉంటే చూపించమని పంచాయతీ తీర్మానం చేసి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. నిరసన తెలిపిన యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.


మంచినీటి ట్యాంకు ఎక్కిన యువకుడు

29న ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా జట్ల ఎంపికలు

మసీదుసెంటర్(కాకినాడ): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు కాకినాడ డీఎస్‌ఏ డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ బుధవారం తెలిపారు. ఈ పోటీలు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమేనన్నారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, యోగా, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 29న ఉదయం 8 గంటల నుంచి కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు. ఆధార్‌కార్డు, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరుకావాలన్నారు. అభ్యర్థులకు టీఏ, డీఏలు ఉండవన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 28 మధ్యాహ్నం ఒంటిగంట లోగా స్వయంగా లేదా dsakakinada2023@gmail.com ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

షట్టర్ తొలగించి.. సీసాలు ఎత్తుకెళ్లి

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెంలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం దుకాణం పక్కన ఉన్న హోటల్ షట్టరు గడ్డపారతో తొలగించి దాని ద్వారా లోపలకు ప్రవేశించి రూ.45వేలు నగదు, 27వేలు విలువ చేసే మద్యం సీసాలను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అమలాపురం నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది. తోట బాల అయ్యప్పస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుట ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు.


చోరీ జరిగిన దుకాణంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

సూచించిన స్థలాల్లోనే బాణసంచా విక్రయించాలి

రామచంద్రపురం: రామచంద్రపురం డివిజన్‌లో తహసీల్దారుతో కూడిన త్రిసభ్య కమిటీ నిబంధనల ప్రకారం సూచించిన స్థలాల్లోనే తాత్కాలిక లైసెన్సులు పొందిన బాణసంచా విక్రయదారులు షాపులను ఏర్పాటు చేసుకోవాలని ఆర్డీవో కె.కౌసర్‌బానో పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో దీపావళి సందర్భంగా తాత్కాలికంగా బాణసంచా అమ్ముకోవడానికి లైసెన్సు పొందేవారు, ఫారం ఎల్ఈ-5 కోసం దరఖాస్తు చేసుకోదలిచన వారు రూ.500లు సీఎఫ్ఎంఎస్‌లో చలానా రూపంలో చెల్లించి అనుమతి పొందాలన్నారు. దీనికి 18శాతం జీఎస్టీ రుసుము చెల్లించాల్సి ఉందన్నారు. దరఖాస్తు దారులు అనుమతుల ధ్రువపత్రాలను ఈనెల 26వ తేదీ లోపు ఆయా తహసీల్దారు కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. లైసెన్సు పొందిన వ్యాపారులు వేరొకరికి బదిలీ చేసినా, అనుమతి లేని ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేసినా, రోడ్లపై తోపుడు బండ్లమీద విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకోక తప్పదని ఆర్డీవో హెచ్చరించారు. రామచంద్రపురం ఆర్డీవోగా కె.కౌసర్‌బానో ఇటీవలే బాధ్యతలు స్వీకరించడంతో రామచంద్రపురం డివిజన్ జేఏసీ ఉద్యోగ సంఘ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	16,000
గటగట	13,500
కొత్తకాయ: గండేరా	15,500
గటగట	13,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	12,000-13,500
కొత్త (పచ్చి) కాయ	11,500-12,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

నర్సుల అసోసియేషన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షురాలిగా బూరిగ విజయలక్ష్మి(110 ఓట్లు) విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి టి.నందన తెలిపారు. అసోసియేషన్ ఎన్నికలు కాకినాడ జీజీహెచ్‌లో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. పోలీసు బందోబస్తు మధ్య అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 243 మంది ఓటర్లు ఉండగా 213 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు నందన తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా బోడే రాణి(126 ఓట్లు), కార్యదర్శిగా గట్టు ప్రమోద(104 ఓట్లు), కోశాధికారిగా కాకి వెంకట పరమేశ్వరి(137 ఓట్లు) గెలుపొందారన్నారు. సభ్యులుగా వి.ఇందిర, కె.దేవి, జి.వీరలక్ష్మి, బి.అక్కమ్మ, ఎం.సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. విజయం సాధించిన ప్యానల్ సభ్యులను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీజీవో సంఘ కార్యవర్గ సభ్యులు శాలువాలు కప్పి సత్కరించారు. ఉమ్మడి జిల్లా ఏపీఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షుడు జి.రామామోహనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ల చంద్రరావు, కాకినాడ యూనిట్ అధ్యక్షుడు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన కార్యవర్గ సభ్యులతో ఏపీఎన్‌జీజీవో సంఘ నాయకులు

ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకం


నిఖిల్

రాజోలు: నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్-17 విభాగంలో రాజోలు ప్రభుత్వ జిల్లా బాలుర పాఠశాల విద్యార్థి గుడాల నిఖిల్ కాంస్య పతకం సాధించాడని ప్రధానోపాధ్యాయిని కె.సరస్వతి తెలిపారు. వ్యాయామోపాధ్యాయుడు సి.హెచ్.వీవీఎస్ ప్రసాదరావు, పతక విజేత నిఖిల్‌ను ఎంఈవోలు మనోహరం, ప్రసాద్, పాఠశాల కమిటీ ఛైర్మన్ పి.ఏసుబాబు, హెచ్ఎం తదితరులు అభినందించారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

అంబాజీపేట: ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జి.సర్వేశ్ కోరారు. మాచవరం-4, ఇరుసుమండ, నందంపూడి సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. 25 వరకు ఆధార్ నమోదు శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన

మామిడికుదురు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా నగరం పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థులకు బుధవారం చట్టాలు, విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడం, ఎఫ్ఐఆర్, దర్యాప్తు, పలు సెక్షన్లు సంబంధించిన అంశాలను ఎస్సై చైతన్యకుమార్ వివరించారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నగరం పోలీస్ స్టేషన్లో విద్యార్థులతో ఎస్సై చైతన్యకుమార్

మేమున్నాం.. మీకు తోడుగా

వెలిగిన వీధి దీపాలు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ర్యాలి గ్రామంలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదంటూ స్థానికుల తెలిపిన సమస్యను సర్పంచి కాయల జగన్నాథం వద్ద ప్రస్తావించగా స్పందించి వీధి దీపాలు వేయించారు.

నగరంలో పరిష్కారం...

మామిడికుదురు: నగరంలో ముస్లిం వీధి, బద్దుగునపేటలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి జాలెం రమణకుమారి, కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చర్యలు చేపట్టారు. కొత్త ఎల్ఈడీ దీపాలు వేయించి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

సమయం: ఉ. 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:

రాజోలు	80085 74174
పి.గన్నవరం	80085 74229
కొత్తపేట	90323 93884

చిన్నారుల భవితకు బాసట

కూటమి ప్రభుత్వం చొరవతో సేవలు

విద్యాశాఖ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేకావసరాల పిల్లలకు భవిత కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తూ సాధారణ పాఠశాల మాదిరిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం సకాలంలో సేవలు అందించకుండా, బోధకులకు బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహించింది. వివిధ రకాల వైకల్యాలతో ఉన్న చిన్నారులకు మూడేళ్లు పాటు ఫిజియోథెరపీ సేవలు దూరం చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రవాణా భత్యాలు మంజూరయ్యాయి.

– న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు, కొత్తపేట, అంబాజీపేట

ఫిజియోథెరపీతో తగ్గిన ప్రయాస

కదలికలు, కండరాల్లో వైకల్యంతో, మెదడు పక్షవాతం, నరాల బలహీనత కారణంగా బాధపడుతున్న పిల్లలకు భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ చేస్తున్నారు. మూడేళ్లుగా సేవలు నిలిచిపోగా, సెప్టెంబరు నుంచి పునరుద్ధరణ కావడంతో పిల్లలు, తల్లిదండ్రులకు వ్యయప్రయాసలు తప్పాయి.


కొత్తపేటలో బాలికకు ఫిజియోథెరపీ..

రవాణా భత్యాల మంజూరు

ప్రత్యేకావసరాల పిల్లలకు రవాణా, అంగరక్షక భత్యాలుగా వేర్వేరుగా నెలకు రూ.300 చొప్పున పది నెలలకు రూ.3 వేలు అందించాలి. బాలికలకు అదనంగా నెలకు రూ.200 చొప్పున పది నెలలకు రూ.2 వేలు ఇవ్వాల్సి ఉంది. ఇంటి నుంచి బయటకు రాలేని వారికి గృహాధారిత విద్యలో భాగంగా నెలకు రూ.300 చొప్పున అందజేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.

ఉపకరణాలు అందజేయాలి

భవిత కేంద్రాల్లో పిల్లలకు వినికిడి యంత్రాలు, మూడు చక్రాల కుర్చీలు, కంటి

నియోజకవర్గం	ప్రత్యేకావసరాల పిల్లలు	కేంద్రాల్లో ఉన్నవారు
రాజోలు	460	82
కొత్తపేట	453	84
పి.గన్నవరం	80	60


రాజోలు భవిత కేంద్రంలో పిల్లలకు బోధన

లోపాలున్న వారికి కళ్లజోళ్లు, బుద్ధిమాంద్యంతో ఉన్న వారికి ఎం.ఆర్ కిట్లు సమకూర్చాలి. మార్చిలో వైద్య పరీక్షలు నిర్వహించినప్పటికీ ఉపకరణాలు అందజేయలేదు.

అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి..

భవిత కేంద్రాల్లో పిల్లలకు అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి. వారానికోసారి ఫిజియోథెరపీ సేవలు నిర్వహిస్తున్నాం. రవాణా భత్యాలకు ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు మంజూరయ్యాయి. ఉపకరణాలకు సంబంధించి ఈ నెల 28న కార్యాచరణ జరగనుంది. భవిత కేంద్రాలకు భవన సౌకర్యాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- ఎంవీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా సమన్వయకర్త

అంతర్వేది స్వామికి వెండి బిందె వితరణ

అంతర్వేది: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన జంపన సూర్యనారాయణ రాజు (కిరణ్) 1.21 కిలోల వెండి బిందెను బుధవారం అందజేశారు. ఆలయ ఏసీ సత్యనారాయణ అభిషేకం చేసి స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.


ఆలయ ఏసీకి వెండి బిందె అందిస్తున్న దాతలు

వైభవంగా అయ్యప్ప పడిపూజ

ర్యాలి (ఆత్రేయపురం): ర్యాలి వెంకటేశ్వరనగర్‌కు చెందిన అయ్యప్ప మాలధారులు మంగళ, బుధవారం గురుస్వాములు ఎస్వీ గురుస్వామి, కస్తూబాబు, తాటిపాక కృష్ణ నేతృత్వంలో పడిపూజ, కలశాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామమంతా అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. నియోజకవర్గ జనసేన బాధ్యుడు బండారు శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బండారు బాబి పాల్గొన్నారు.


పూజలో స్వాములు


హనుమత్ వాహన సేవ


హారతి ఇస్తున్న అర్చకుడు

శ్రీహరే జగమంతా.. శ్రీవారే మనసంతా

ఆత్రేయపురం: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం మలయప్పస్వామివారు కోదండరామ అవతారంలో సర్వాలంకార భూషితులై దర్శనమిచ్చారు. వివిధ బృందాల కళాకారులు, భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కోలాహలంగా సాగింది. ఉదయం లక్ష తులసిపూజ, అష్టోత్తర శతకలశాభిషేకం, నవగ్రహ హోమం తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. ఈవో ఎన్.ఎస్. చక్రధరరావు పర్యవేక్షించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, పాల్గొని వెంకటరమణ ఉత్సవాల్లో, తోట సర్పంచి కాయల జగన్నాథం తదితరులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రమణీయంగా జరిపించారు. దేవస్థానం కార్య...


కాళికా వేషధారణ


కేరళ కళాకారుల వాయిద్యం

అమ్మవార్లకు మంగళసూత్రాల బహూకరణ

మలికిపురం, న్యూస్‌టుడే: స్థానిక ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి, గోదాదేవి, వైష్ణవిద్య అమ్మవార్లకు మలికిపురం ముదునూరివారి మెరకకు చెందిన క్షత్రివెంటి సూర్యనారాయణమూర్తి, సత్యవసంత, అమృతవల్లి కుటుంబ సభ్యులు బుధవారం బంగారు మంగళసూత్రాలు బహూకరించారు. ఆలయంలో సూత్రాలకు ప్రత్యేక పూజలు చేసి ధర్మకర్త వుయ్యూరి హరరాజు, ప్రధాన అర్చకుడు కృష్ణమాచార్యులకు అందజేశారు.

పనులు వేగవంతం చేయండి: ఎస్ఈ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పెదపూడి-ఊడిమూడిలంక గ్రామాలకు ఏఐఐబీ నిధులు రూ.49.50 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులు మరింత వేగవంతం చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాస్ ఆదేశించారు. వరద ప్రవాహం తగ్గినందున అప్రోచ్, ఇతర పనులు చురుగ్గా చేయాలన్నారు. వంతెన పనుల ప్రగతిని ఈఈ రామకృష్ణ, డిప్యూటీ ఈఈ అప్పారావు, ఏఈఈలు సత్యనారాయణ, కొండలరావులు ఆయనకు వివరించారు. వంతెన పనులకు సంబంధించి రూ.19 కోట్ల బిల్లుల బకాయిలు ఇప్పించాలని గుత్తేదారు పి.ఎస్.రాజు కోరారు.


పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు

డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు 25న

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 25న ఉదయం 10 గంటల నుంచి ఏపీఎస్ఎస్‌డీసీ, ఉపాధి కార్యాలయం, ఎస్‌ఈఈడీఏపీ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పి.సాయిబాబు తెలిపారు. ఇన్నోవా సోర్స్, యంగ్ ఇండియా, శ్రీరామ్ లైఫ్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికకు గాను అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, బయోడేటాతో హాజరుకావాలన్నారు. వివరాలకు ఫోన్ నం 96039 40274లో సంప్రదించాలని కోరారు.

మార్కెటింగ్‌కు అనుగుణంగా పంటలు పండించాలి

అంబాజీపేట: మార్కెటింగ్‌కు అనుగుణంగా ఉన్న ఉద్యాన పంటలను పండించాలని వ్యవసాయాధికారి డి.విజయకుమార్, ఉద్యాన విస్తరణాధికారి డి.వెంకటేశ్వరరావు అన్నారు. వక్కలంక, మొసలపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. సర్పంచి వాసంశెట్టి రేవతి, ఏఈవో డి.దుర్గారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం విజయానికి కృషి

మలికిపురం: ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపుకు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కూటమి నాయకులు, కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీశ్‌మాధుర్, ఎమ్మెల్యే దేవవరప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఎలిసన్ ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ హాలులో బుధవారం ఎమ్మెల్యే అధ్యక్షతన ఎమ్మెల్సీ అభ్యర్థి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో జనసేన 15 వేల మంది పట్టభద్రులకు ఓట్లు నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్ల నమోదుకు అనుసరించాల్సిన విధానాలు వివరించారు. అభ్యర్థి రాజశేఖరం మాట్లాడుతూ తనను గెలిపించాలని కూటమి నాయకులు, కార్యకర్తలను కోరారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, చిటికెన రామ్మోహనరావు, గెద్దం మహాలక్ష్మీప్రసాద్, తాడి మోహన్, వాగంటి స్వామి, మంగెన భూదేవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో రాజశేఖరం, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే దేవ

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

కొత్తపేట నియోజకవర్గంలోని పలు మండలాల్లో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల చేతికందేంత ఎత్తులో వేలాడుతూ... మరికొన్నిచోట్ల పిచ్చిమొక్కలు తీగలు అల్లుకుని భయపెడుతున్నాయి. ఆలమూరు మండలం పాపయ్య కాలనీలో పలుచోట్ల విద్యుత్తు తీగలు ఇళ్లకు అందేలా వేలాడుతుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సమయంలో మంటలు వస్తున్నాయని చెబుతున్నారు. ఇళ్లకు సమీపంలోని తీగలు తగిలి ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. వెంటనే విద్యుత్తు శాఖ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న తీగలు

పిచ్చిమొక్కలు అల్లుకుని..

కొత్తపేట మండలంలో పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పిచ్చితీగలు అల్లుకోవడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ వర్షాలు కురుస్తుండటంతో షార్ట్ సర్క్యూట్ అయి సరఫరా నిలిచిపోతుందేమోనని భయపడుతున్నారు. వాడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో విద్యుత్తు స్తంభం వద్ద ఇదే పరిస్థితి ఉండటంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యలను ఏఈ వి.శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై అల్లుకుపోయిన తీగలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ఆలమూరు, కొత్తపేట


పాపయ్య కాలనీలో ఇంటి వద్ద చేతికి అందేలా విద్యుత్ తీగ

సీఎం సహాయనిధితో ఆసరా

పి.గన్నవరం: సీఎం సహాయనిధి ద్వారా ఎంతో మందికి ఆసరా కలుగుతోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరంలో బుధవారం ఆయన కూటమి నేతలతో కలిసి పలువురికి చెక్కులు పంపిణీ చేశారు. 15 మందికి రూ.7,47,289 సాయం అందజేశామన్నారు. కూటమి నాయకులు నామన రాంబాబు, డొక్కా జగన్నాథం, శిరగనీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, పప్పినీడి రాంబాబు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

రీసర్వే సమస్యలపై అర్జీలు

అంబాజీపేట: భూ సమస్యల సత్వర పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. మొసలపల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉప సర్పంచి కట్టా గోపాలకృష్ణగోఖలే, ఎంపీటీసీ సభ్యుడు మామిళ్లపల్లి సత్యనారాయణ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై దర్యాప్తు చేయాలి

ఆలమూరు, న్యూస్‌టుడే: మడికి చిలకలపాడుకు చెందిన పదో తరగతి విద్యార్థిని ప్రవల్లిక ఇటీవల వెన్నెల ఆత్మహత్యకు సంబంధించిన వాస్తవాలు వెలికితీయాలని బుధవారం ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు రాత్రి గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దసరా సెలవుల అంశంలో కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నిరాకరించిన అధికారులు పాఠశాల యాజమాన్యం మండలిలో పట్ల తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని పేర్కొంటూ మంగళవారం వెన్నెల తండ్రి బాబీ ఆలమూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై త్వరితగతిన విచారించి న్యాయం చేయాలని వారు కోరారు. ఫ్లూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జి రవికుమార్, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమలాపురం కలెక్టరేట్: విద్యార్థిని మృతిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) నాయకులు కలెక్టర్‌ వద్ద నిరసన తెలిపారు. పాఠశాల యాజమాన్యం వేధింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. వెంకట్, సురేష్, ప్రసాద్, శ్యామ్ వినయ్, ఉదయ్ పాల్గొన్నారు.


మడికిలో కొవ్వొత్తుల ర్యాలీలో ప్రజలు

రహదారి దుస్థితిపై ఆందోళన

మామిడికుదురు, న్యూస్‌టుడే: 'మా రోడ్డు నడవడానికి కూడా వీల్లేనంత దుర్భరంగా మారింది. గత ఐదేళ్ల కాలంలో ఎవరూ పట్టించుకోలేదు. గుంతలు పెరిగిపోవడంతో ఆర్టీసీ బస్సు సర్వీసు కూడా నిలిచిపోయింది. మా ఆవేదనను ఎవరికీ పట్టదా' అంటూ బి.దొడ్డవరం గ్రామస్థులు బుధవారం ఆందోళన చేశారు. వర్షం నీటితో నిండి మడుగులా మారిన గుంతల వద్ద నిరసన వ్యక్తం చేస్తూ నినదించారు. సత్వరమే రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఆర్.అండ్.బి. శాఖ ఏఈఈ కె.సురేష్ దృష్టికి తీసుకెళ్లగా, సీఆర్ఐఎఫ్ రూ.15 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపడతామని చెప్పారు.


బి.దొడ్డవరంలో రోడ్డుపై గ్రామస్థుల నిరసన

కళాశాలను సందర్శించిన విశ్వవిద్యాలయ అధికారులు

మలికిపురం: స్థానిక ఎమ్మెవీఎన్ జేఎస్ అండ్ ఆర్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జీతాల కోసం 43 రోజులుగా తరగతులు బహిష్కరించి రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నేపథ్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుధాకర్, పరీక్షల నిర్వహణాధికారి మట్టారెడ్డి బుధవారం కళాశాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. సెమిస్టర్ల బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు లేరని, నవంబరులో జరిగే పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థులు కోరారు. ఒక్కరోజు కళాశాలలో సమస్య గురించి విశ్వవిద్యాలయం పరిధిలో పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. అవసరమైతే మధ్యాహ్నం కూడా తరగతులు నిర్వహిస్తారని, విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

ఘనంగా ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: సినీ నటుడు ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం రావులపాలెంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు కేక్ కోసి అభిమానులకు పంచారు. అభిమానులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

అంతర్వేది: అంతర్వేది దేవస్థానం 16 స్తంభాల మండపం, పల్లిపాలెం, గొంది తదితర గ్రామాల్లో సినీ హీరో ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక యువత కేక్ కోసి వేడుక నిర్వహించారు.

మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

మామిడికుదురు: అనాతవరం పల్లి జెల్ల ఆనుపుతాహరి పెంటాయ్ సెల్‌లో ఆగస్టు 21న రియాక్టర్ పేలిన దుర్ఘటనలో మామిడికుదురు మండలం పాశర్లపూడిలంకకు చెందిన మోరిశెట్టి సతీష్ మృతిచెందగా... ఆయన కుటుంబానికి ఫార్మా సంస్థ రూ.5 లక్షల పరిహారాన్ని కేటాయించింది. జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం సతీష్ భార్య నాగమణికి చెక్కును అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, పార్టీ నాయకులు కొమ్ముల రాము, నీతిపూడి గణేష్‌బాబు, నక్కా వెంకటేశ్వరరావు, తులా గోపాలకృష్ణ, జక్కంపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలికి పరిహారం చెక్కును అందజేస్తున్న జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు

రూ. 84 లక్షలతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి గ్రామంలో విలసచానల్ పంట కాలువపై ఆర్ అండ్ బీ రహదారిపై వంతెన క్రమంగా నిర్మించిన వంతెన రెండు వైపులా రక్షణ గ్రిల్స్ దెబ్బతిన్నాయి. కింది భాగంలో స్లాబు పెచ్చులూడి బీటలు వారుతుండటంపై 'శిథిల వంతెన.. ప్రమాద సంకేతం' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై ఆర్‌అండ్‌బీ జేఈ రమేష్ స్పందించి బుధవారం వంతెనను పరిశీలించారు. రూ. 94 లక్షలతో నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. భారీ వాహనాలు రాకపోకలు చేయకుండా రక్షణ చర్యలు చేపడతామన్నారు. సర్పంచి కాకర శ్రీనివాసరావు, ఉపసర్పంచి పోలిశెట్టి రాజేష్ తదితరులు ఉన్నారు.


వంతెన దుస్థితిని పరిశీలిస్తున్న జేఈ రమేష్

ఈనాడు కథనానికి స్పందన

రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించడం దారుణం

అంబాజీపేట: పుల్లేటికుర్రు కూడలిలో ఏళ్ల తరబడి ఉన్న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించి వేయడమేనా చర్య అని అంబాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. తొలగించిన చోటే యథావిధిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీ శ్రేణులు, ప్రజల మద్దతుతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం కార్యదర్శి లక్ష్మీపతికి వినతిపత్రం అందజేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ, నాయకులు మాచవరపు నాగేంద్రరావు, ములపర్తి మోహనరావు, ఆదుర్తి నారాయణమూర్తి, కడలి రమేష్ పాల్గొన్నారు.

శైవాగమ పండితుడు విశ్వనాథం మృతికి సంతాపం

అంబాజీపేట: కోనసీమలో ప్రముఖ శైవాగమ పండితుడు, ఆధ్యాత్మికవేత్త విరుదు పొందిన పుల్లేటి విశ్వనాథం (95) మంగళవారం రాత్రి గంగలకుర్రులోని నివాసంలో అనారోగ్యంతో కన్నుమూశారు. కోనసీమలో పేరెన్నిక గల శివాలయాల్లో స్వామివారి కల్యాణోత్సవాలను ఆయన తరతరాలుగా నిర్వహించారు. గంగలకుర్రులోని ఉమాపార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయ అర్చకులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన మృతికి మండల అధికారులు, అర్చక సంఘం సంతాపం వ్యక్తం చేసింది.


విశ్వనాథం (పాత చిత్రం)

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం



నమోదు చేయిస్తున్న భాజపా నాయకులు

భాజపా సభ్యత్వ నమోదు

అమలాపురం పట్టణం: అభివృద్ధి, సంక్షేమం, దేశ రక్షణ భాజపాతోనే సాధ్యమని జిల్లా కార్యదర్శి మోకా సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం అమలాపురం పట్టణంలో భాజపా సభ్యత్వ నమోదు నిర్వహించారు. నియోజక వర్గంలో 12వేల సభ్యత్వాలు చేయించామని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి రూ.వేల కోట్లు ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో అరిగెల తేజా, సాయి బొంతు ఉదయ్, పాటి సత్తిరాజు, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెరగాలి

కాట్రేనికోన: వచ్చే పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలని డీఈవో కమలకుమారి సూచించారు. కాట్రేనికోన జడ్పీఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేసిన ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. ఎంఈవో వెంకటరమణ, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

ముగిసిన జాతర



అమ్మవారిని అత్తవారింటికి పంపిస్తూ..

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చల్లపల్లి గ్రామదేవత మహిషాసురమర్దిని అమ్మవారి జాతర ముగింపు ఉత్సవం బుధవారం జరిగింది. నైవేద్యాలు సమర్పించి గరగన్యత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ అత్తవారింటికి పంపించారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

యానాం: యానాం పట్టణ తాగునీటి సరఫరా విభాగానికి సంబంధించి నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా ఈ నెల 24వ తేదీ సాయంత్రం పలు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రజా పనుల శాఖ ఏఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. యానాం పట్టణ ప్రాంతం, మెట్టకూరు, గోపాల్‌నగర్, అంబేడ్కర్ నగర్, ఫ్రాన్స్‌తిప్ప, కురసాంపేట ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కార్మికులకు బోనస్ ప్రకటన

యానాం: పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా దీపావళి సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు రూ.5వేలు, సంస్థాగత కార్మికులకు రూ.1500 బోనస్‌ను ముఖ్యమంత్రి రంగసామి బుధవారం ప్రకటించారు. రూ.1000 విలువైన 10 వస్తువులతో కూడిన కిరాణా సరుకుల కిట్టును రూ.500లకు రాయితీపై అందించనున్నారు.

కార్యదర్శులకు సత్కారం

అల్లవరం: మండలం నుంచి బదిలీపై వెళ్లిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సత్కరించారు. పిల్లి శ్రీనివాస్, అడబాల శ్రీరామచంద్రమూర్తి, కంకిపాటి సత్యనారాయణ బదిలీ కాగా, వారిని సన్మానించారు. ఎంపీపీ ఇళ్ల శేషారావు, కార్యదర్శులు రాజ్ మోహన్, శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఐ.పోలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మధుసూదన్‌రావు బుధవారం తనిఖీ చేశారు. గణితపాల్ ల్యాబ్, గార్డెన్లు, తరగతుల నిర్వాహణ, క్రీడామైదానాన్ని పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారులు కొండారెడ్డి, తిరుమలరావు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పాపారావు, ఆకుల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అతివల ఆర్థిక స్వావలంబన

నెలకు రెండుసార్లు మెప్మా బజార్ ఏర్పాటు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. వారు తయారు చేసిన వివిధ వస్తువులు విక్రయించేందుకు చర్యలు చేపట్టారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో నెలకు రెండు రోజులు బజార్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా కొంత ఆదాయం వస్తే కుటుంబానికి చోదోడువాదోడుగా ఉంటుందని మహిళలు చెబుతున్నారు. మరోవైపు వినియోగదారులకు తక్కువ ధరలకు నాణ్యమైన ఉత్పత్తులు లభించే వీలు కలుగుతుంది.



మెప్మా బజార్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ రాజు

వివిధ ఉత్పత్తుల విక్రయం

వైకాపా పాలనలో మెప్మాబజార్‌లను ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ప్రారంభించింది. స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ ఉత్పత్తులను మెప్మా అర్బన్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అమలాపురంలోని గడియారస్తంభం ప్రాంగణంలోని ఏర్పాటు చేసిన ఈ బజార్‌ను బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ కెవీవీఆర్ రాజు, కౌన్సిలర్లు ప్రారంభించారు. మెప్మా, బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు వివిధ తినుబండారాలు, అల్లిక వస్తువులు తయారు చేసి విక్రయిస్తున్నారు. తక్కువ ధరలకు అమ్మడంతో మంచి స్పందన వస్తోందని విక్రేతలు చెబుతున్నారు.



వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

వస్త్ర వ్యాపారంలో అభివృద్ధి

మాది మధ్యతరగతి కుటుంబం. సొంతంగా ఉపాధి పొందాలని మెప్మా శ్రీబాబా గ్రూప్‌లో చేరా. 2018లో స్థానిక వస్త్ర వ్యాపారం ప్రారంభించా. తొలుత రూ.10 వేల రుణంతో ప్రారంభించి నేడు రూ. లక్షతో వ్యాపారం చేస్తున్నా. రూ.200 నుంచి రూ.5వేలు విలువైన చీరలు విక్రయిస్తున్నా. - ప్రమీల

గ్రామీణ ఉత్పత్తులు అమ్మేలా..

చేతి వృత్తి, స్వదేశీ, కుటీర పరిశ్రమలు, గో ఆధారిత సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముతున్నాం. సహజసిద్ధ ఉత్పత్తులను కొని ప్రోత్సహించాలి. అందుబాటు ధరల్లో ఆరోగ్యకరమైన సరకులను విక్రయిస్తున్నాం. - గిరిజ

జీడిపప్పు, పచ్చళ్ల వ్యాపారం

2014లో శ్రీచైతన్య గ్రూప్ ద్వారా రూ.10వేల రుణంతో వ్యాపారం మొదలుపెట్టా. నేడు రూ.2 లక్షలతో స్థానిక ప్రభాకర్‌నగర్‌లో దుకాణంలో జీడిపప్పు, సొంతంగా తయారుచేసిన పచ్చళ్లతో వ్యాపారం నిర్వహిస్తున్నా. మెప్మా బజారుతో వ్యాపారం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. – చిటికెన లక్ష్మి, ప్రభాకర్ నగర్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పోటీ పరీక్షలతో మెదడుకు పదును

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: పోటీ పరీక్షలతో మెదడుకు పదును పెట్టవచ్చని భాష్యం పాఠశాల జోనల్ ఇన్‌ఛార్జి జవ్వాది వెంకట శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం అమలాపురం భాష్యం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాలయం వినియోగంపై కలిగే లాభాలు, నష్టాలు, సామాజిక మాధ్యమ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో వరుసగా పీజేఎల్ భవిజ్ఞ, ఎం.దర్శిని ఖాళీ ప్రియ, కె.మోక్షశాంతి నిలిచారు. అనంతరం విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను, ప్రశంసా పత్రాలను పాఠశాల జోనల్ ఇన్‌ఛార్జి జవ్వాది వెంకట శ్రీనివాస్, ప్రిన్సిపల్ సీహెచ్.రవి అందజేశారు.



విద్యార్థినులతో పాఠశాల ఇంఛార్జి వెంకట శ్రీనివాస్, ప్రిన్సిపల్ సీహెచ్ రవి

పల్లె పండగతో గ్రామాల అభివృద్ధి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి నిధులతో సీసీ రహదారుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. వైకాపా ప్రభుత్వం గ్రామీణ రహదారులను గాలికి వదిలేసిందని ఆయన ఆరోపించారు. సంక్రాంతి పండగ నాటికి పల్లెలన్నీ నూతన రోడ్లతో కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. భీమనపల్లిలో రూ.16 లక్షలు, విలసవిల్లిలో రూ.10 లక్షలు, కిత్తనచెరువులో 7.5 లక్షలతో చేపట్టే సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



భీమనపల్లిలో ఆనందరావు, రమణబాబు తదితరులు

ట్రాక్టర్ల రాకపోకలతో ఇక్కట్లు

అమలాపురం పట్టణం: అమలాపురంలోని వాటర్ ట్యాంకర్లు ఇరుకైన బులియన్ మార్కెట్ రోడ్డులో రాకపోకలు సాగించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ది అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో కలిసి అమలాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ఆయన మున్సిపల్ కమిషనర్ రాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. సత్యవరప్రసాద్ మాట్లాడుతూ బంగారం, వెండి దుకాణాల ముందు నుంచి చెత్త తరలిస్తుండటంతో దుర్వాసన వస్తోందన్నారు. ఈ మార్గంలో వాటి రాకపోకలు నిలిపివేయాలని కోరారు. కార్యదర్శి కె.వెంకటాచలప్రసాద్, మోకా సుబ్బారావు, చింతలపూడి సత్తిబాబు, డి.సత్యనారాయణ, అనుపోజు శ్రీను పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

లక్ష్యం నిర్దేశించుకోవాలి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: డిగ్రీ చదివే విద్యార్థులు మొదటి ఏడాదిలోనే సమున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కాట్రేనికోనలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ముంగండ నాగరాజు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ కొంకి రవి అధ్యక్షతన బుధవారం కళాశాల ఆవరణలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి దంతులూరి వాసురాజు ఆధ్వర్యంలో సినీనటుడు ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమలాపురంలోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కేకు కోశారు. ● స్కేటింగ్‌లో జాతీయ స్థాయి అర్హత పొందిన కె.శ్రీధర్‌ను ఎమ్మెల్యే ఆనందరావు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, అల్లవరం మండల అధ్యక్షుడు డి.సత్తిబాబు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, పి.ధర్మపాల్ తదితరులు పాల్గొన్నారు.



తెదేపా కార్యాలయంలో కేకు కోసిన ఎమ్మెల్యే ఆనందరావు

కార్మికుల శ్రమశక్తి దోపిడీ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: జిల్లాలోని చమురు నిక్షేపాల అన్వేషిత సంస్థలు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా శ్రమను దోచుకుంటున్నాయని సిస్మిక్ సర్వే కార్మికులు ఆరోపించారు. ఉప్పలగుప్తంలోని అంబేడ్కర్ భవన్‌లో నేషనల్ ఓఎన్జీసీ వర్కర్స్ యూనియన్ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండు చేశారు. బీఎస్పీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి పొలమూరి మోహన్‌బాబు, కోలా త్రిమూర్తులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, సర్పంచి కడిమి చిన్నవరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ

కాట్రేనికోన: కాట్రేనికోన జడ్పీఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు, వాకర్స్ క్లబ్ సభ్యులు బుధవారం పాఠశాలకు 8 సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. షటిల్ కోర్టు నిర్మాణం నిమిత్తం రూ.10 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. గ్రంధి సురేష్, బి.నాగేశ్వరరావు, ఆశపు సూరిబాబు, తాతాజీ, కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, బి.కృష్ణ, బద్రి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

కాట్రేనికోన, న్యూస్‌టుడే: అమలాపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్-2024లో తమ కళాశాల విద్యార్థిని ఎ.దుర్గామహాలక్ష్మి మూడోస్థానంలో నిలిచిందని చెయ్యేరులోని శ్రీనివాస స్వయంప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసకుమార్ తెలిపారు. జానపద నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆమెను బుధవారం సెక్రటరీ కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, సందీప్, జయలక్ష్మి, వి.సాయిప్రియ, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

రాజకీయ వేధింపులతోనే అరెస్టు

అల్లవరం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ అరెస్టు రాజకీయ వేధింపుల్లో భాగంగానే జరిగిందని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పేర్కొన్నారు. బుధవారం ఆయన అల్లవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకాపాలోని దళితులను అక్రమ కేసుల ద్వారా భయపెట్టాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. దీనిపై తామంతా న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషారావు, జడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, బాపూజీ, తిక్కా ప్రసాద్, నాతి శ్రీను, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాలో మహిళ..

ఐ.పోలవరం: యానాం నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఓ మహిళను ఐ.పోలవరంలో అరెస్టు చేశారు. పెదమడికి చెందిన సానబోయిన దుర్గామల్లేశ్వరి బుధవారం ద్విచక్ర వాహనంపై యానాం నుంచి వస్తుండగా ఎదుర్లంక వారధి వద్ద తనిఖీ చేశారు. వాహనంలో 30 మద్యం సీసాలు బయటపడినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు.

బోటులో మత్స్యకారుడు ఆత్మహత్య

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: భైరవపాలేనికి చెందిన మత్స్యకారుడు సముద్రంలో వేటసాగిస్తున్న బోటులోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓలేటి వీరబాబు(35) మరికొంత మందితో కలసి వేటసాగించేందుకు బోటులో సముద్రంలోకి వెళ్లాడు. రాత్రి సమయంలో అందులో ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు.

యానాంలో ఉద్యోగుల ఆందోళన



యానాం: యానాంలోని ప్రజా పనుల శాఖ ఈఈ కార్యాలయం వద్ద బుధవారం ఉద్యోగులు ఆందోళన చేశారు. ప్రజాపనుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి కర్రి నాగబాబు డిమాండ్ చేశారు. వన్‌టైం సెటిల్‌మెంట్ ప్రాతిపదికన ఎంటీఎస్ అసిస్టెంట్లుగా పర్మినెంట్ చేయాలని కోరారు.

ఆగని మద్యం అక్రమ రవాణా

న్యూస్‌టుడే, కాట్రేనికోన

మండలంలోని కొన్ని గ్రామాల్లో మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు ఆగడం లేదు. తీరగ్రామాలతో పాటు ఎక్కడబడితే అక్కడ బెల్టు దుకాణాలు కొనసాగుతున్నాయి. యానాం నుంచి బోట్ల ద్వారా ఎన్‌డీపీఎల్ మద్యాన్ని తీసుకువచ్చి అధిక రేట్లకు విక్రయించడంలో అక్రమార్కులు ఆరితేరారు. ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పడటంతో అక్కడి నుంచి తీసుకువెళ్లి పలుచోట బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. బలుసుతిప్ప, చిర్రయానం, పల్లం, కొత్తపాలెం తదితర తీరగ్రామాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. రోడ్డుపక్కన చిన్న దుకాణాల్లో తెల్లవారుజాము నుంచే మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. తీరగ్రామాల్లో అనధికార వేలం పాటలు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల చిర్రయానంలో మద్యం విక్రయించేందుకు రూ.9.70 లక్షలకు వేలంపాట జరిగిందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగింది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. పల్లంలో దసరా సందర్భంగా బహిరంగంగా మద్యం విక్రయాలు నిర్వహించారు.



ఇటీవల బలుసుతిప్పలో పట్టుకున్న మద్యంతో పోలీసులు

ఎక్కడికక్కడ..

● ఇటీవల బలుసుతిప్పలో యానాం మద్యం విక్రయిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ. 12,500 విలువచేసే 173 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● కొత్తపాలెంలో రూ.ఆరు వేలు విలువచేసే 20 మద్యం సీసాలతో నిందితున్ని పట్టుకున్నారు.

● కాట్రేనికోనలో ఓ కూల్‌డ్రింక్ దుకాణంలోను మద్యం విక్రయాలు సాగిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇవన్నీ యానాం నుంచి తెచ్చి విక్రయిస్తున్నవే. దీనిపై ఎస్సై అవినాష్‌ను వివరణ కోరగా.. ఎక్కడైనా అక్రమంగా మద్యం దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నామన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టిసారించామని పేర్కొన్నారు.

నట్టల నివారణ మందు తప్పనిసరి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: పెంపకందారులు తమ గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయించాలని భీమనపల్లి పశువైద్యాధికారిని నిరోషా సూచించారు. బుధవారం చినగాడవిల్లిలో జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. ఎంపీటీసీ సభ్యుడు స్వామినాయుడు, జూనియర్ పశు వైద్యుడు కె.రామారావు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురం మండలం కామనగరువు రైతు సేవా కేంద్రంలో రైతులకు, వ్యవసాయ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. అమలాపురం సబ్ డివిజన్ సహాయ సంచాలకులు ఎంఎ షంషీ వివిధ అంశాలను వివరించారు. మండల వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై దర్యాప్తునకు డిమాండ్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆలమూరు మండలానికి చెందిన విద్యార్థి మృతిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవుల్లో పాఠశాల నిర్వహిస్తుండటంపై విద్యార్థిని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిందనే అక్కసుతో పాఠశాల యాజమాన్యం వేధింపులకు పాల్పడడం దుర్మార్గం అన్నారు. అనంతరం డీఆర్వో వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు. వెంకట్, సురేష్, ప్రసాద్, శ్యామ్ వినయ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు

హుండీలో నగదు చోరీ

అమలాపురం పట్టణం: రోళ్లపాలెంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం ఉదయం హుండీని బద్దలకొట్టి నగదు పట్టుకుపోయారు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా భీమరాజు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురం తాలుకా అగ్నికులక్షత్రియ సంఘం అధ్యక్షుడిగా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం గ్రామానికి చెందిన లంకె భీమరాజు ఎంపికయ్యారు. అమలాపురంలో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు ఉపాధ్యక్షులుగా కొల్లు రామారావు, అర్థాని శ్రీనులను, కార్యదర్శిగా కొప్పాడ వెంకట రామకృష్ణను, 24 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు భీమరాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, నాగిడి నాగేశ్వరరావు, చింతా శ్రీను, కొల్లు బాబ్జి తదితరులు ఆయనను అభినందించారు.

వాసవీక్లబ్ గవర్నర్‌గా రాఘవ



అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వాసవీక్లబ్ అంతర్జాతీయ గవర్నర్‌గా అమలాపురం పట్టణానికి చెందిన యెండూరు రాఘవ నియమితులయ్యారు. రాజమహేంద్రవరం వాసవీక్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రవిచంద్రన్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. రాఘవ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ కార్యదర్శిగా, వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల సభ్యురాలిగా ఉన్నారు. ఆమెకు వైశ్య సంఘం నాయకులు అభినందలు తెలిపారు.

సెపక్‌తక్రాలో ద్వితీయ స్థానం

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తా చాటారు. శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ నగరపాలకోన్నత పాఠశాల మైదానంలో పోటీలు బుధవారం ముగిశాయి. మహిళల విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ, పశ్చిమగోదావరి ద్వితీయ, కర్నూలు, ప్రకాశం జట్లు సంయుక్తంగా తృతీయ స్థానం దక్కించుకున్నాయి. పురుషుల విభాగంలో కర్నూలు జట్టు ప్రథమ స్థానం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జట్టు ద్వితీయ, శ్రీకాకుళం, ప్రకాశం జట్లు సంయుక్తంగా తృతీయ స్థానం సొంతం చేసుకున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

ట్యాంకు శుభ్రం చేశారు..

సమస్య: కాట్రేనికోనలోని పల్లంలో తాగునీటి ట్యాంకులో పల నాచు ఏర్పడింది. అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేసే పనులు చేపట్టాలి. - స్థానికులు

పరిష్కారం: ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. తమ సిబ్బందితో ట్యాంకును బ్లీచింగ్‌తో కడిగించారు.

వీధిదీపాలకు మరమ్మతులు



సమస్య: కాట్రేనికోనలో కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. - గ్రామస్థులు

పరిష్కారం: ఈ సమస్యని సర్పంచి సుధాకర్‌కు తెలుపగా వెంటనే స్పందించారు. సిబ్బందితో వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

గుంతలో పడితే.. గాయాలే..!

ముమ్మిడివరం మండలం చినకొత్తలంక నుంచి కొత్తలంక వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారి మలుపుల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ముమ్మిడివరం




చినకొత్తలంక నుంచి కొత్తలంక వెళ్లే రోడ్డులో..

ఆదమరిస్తే ప్రమాదమే..!



ఎన్టీఆర్ మార్గ్‌లో ప్రమాదకరంగా ఇలా..



బయటపడిన ఇనుప ఊచలు

అమలాపురం పట్టణంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో చిన్నవంతెన అధ్వానంగా మారింది. ఇక్కడ ఇనుప ఊచలు బయటకు వచ్చి ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిలో ఆర్డీవో, రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్, ఎస్పీ బంగ్లా, ఆర్‌డబ్ల్యూఎస్, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్, తాలుకా పోలీస్‌స్టేషన్, సీడీపీవో తదితర ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. హౌసింగ్‌బోర్డు కాలనీకి ఈ చిన్నవంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం వీరంతా అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో వీధిదీపాలు వెలగడం లేదు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు వద్ద ప్రస్తావించగా మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

మండపేట

•మండపేట •రామచంద్రపురం

సమాచార హక్కు చట్టంపై అవగాహన

అంగర: కపిలేశ్వరపురం మండలం టేకిలో మండల వ్యవసాయాధికారి కేవీఎన్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయిలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. అధికార యంత్రాంగాల అదుపులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. అధికారులు విధుల్లో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏవో రమేష్‌కుమార్

తెదేపాలో చేరిన వైకాపా కౌన్సిలర్

మండపేట: రోజు రోజుకూ మండపేట మున్సిపల్ కౌన్సిల్‌లో వైకాపా కౌన్సిలర్ల బలం తగ్గుతోంది. 22వ వార్డు కౌన్సిలర్ బొక్కా సరస్వతి తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో తెదేపాలో చేరారు. బుధవారం తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వైస్‌ఛైర్మన్ పిలి గణేశ్వరరావు, మల్లిపూడి గణేశ్వరరావు, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో తెదేపాలో చేరిన 22వ వార్డు కౌన్సిలర్ సీత

స్పందనకు వందనం

చెత్త తొలగించారు

ద్వారపూడి: మండపేట మండలం కేశవరం గ్రామ పరిధి దేవుడుతాళ్లు ఎస్సీ కాలనీ పాత రైతుభరోసా కేంద్రం వీధిలో రహదారి పక్కన చెత్త పోయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుందని 23న చెత్త తొలగించరూ.. శీర్షికన మేమున్నాం. మీకు తోడుగాలో ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి ఎన్.సుబ్బారావు స్పందించారు. వెంటనే చెత్త తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంతోపాటు నియోజకవర్గంలో కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల్లో నిర్దేశించిన గ్రామాల్లో ఆయా రోజుల్లో ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. 24వ తేదీన పట్టణంలోని గంగుమళ్లవారి వీధి సచివాలయంలో ఆధార్ నమోదు, తప్పొప్పుల సవరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు. 24,25 తేదీల్లో ఓదూరు, వెల్ల-2, ఇక కె.గంగవరం మండలంలో 24,25 తేదీల్లో పామర్రులో నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తడి పొడి చెత్తపై అవగాహన కల్పించాలి

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణంలో ఇంటింటికీ వెళ్లి తడి పొడి చెత్త వేరుచేయడంపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రంగారావు తెలిపారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఆర్పీలకు అవగాహన కల్పించారు. దీని వల్ల కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత ఆర్పీలదేనన్నారు. ప్లాస్టిక్ నిషేధం గురించి తెలియజేయాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు కాలువల్లో వేయకూడదన్నారు. కార్యక్రమంలో టీఈ సుజాత, ఆర్పీలు పాల్గొన్నారు.

అసౌకర్యాలున్నా... ఆటల్లో మెరికలు

అంగర, న్యూస్‌టుడే: ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపిస్తున్నారు కపిలేశ్వరపురం సర్వారాయ ఉన్నత పాఠశాల విద్యార్థులు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తూ క్రీడల్లో ప్రావీణ్యం సాధిస్తున్నారు. ఇటీవల పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన పలు ఆటల పోటీల్లో మెరిసి, రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. అండర్ 14, 17 విభాగంలో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు అందుకున్నారు. పాఠశాలలో ఉన్న అరకొర సౌకర్యాలతోనే సాధన చేస్తూ, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల నుంచి 24మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరంతా త్వరలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొనడానికి సన్నద్ధమవుతున్నారు. జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపిక కావాలని ముమ్మరంగా సాధన చేస్తున్నారు. హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్ 17 విభాగంలో ఎస్.సూర్యకుమార్, డి.కల్యాణి, ఎ.వర్షిణి, కె.జోష్న, బి.కృపారాణి, అండర్ 14 విభాగంలో వి.దుర్గాప్రసాద్ ఎస్.యశ్వంత్, పి.కిరణ్, కె.మమత, పి.మహాలక్ష్మి, కె.నవ్య, కె.వినిత, అండర్ 19 విభాగంలో కె.హనూక్, ఎ.చైతన్య, బి.వీరేష్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వంగా శ్రీనివాస్, పీడీ వేణుగోపాలరావు తెలిపారు. బాల్ బాడ్మింటన్‌లో కె.కుమార్, నెట్టుబాల్‌లో ఎస్.సూర్యకుమార్, బి.లిఖిత్, ఎ.వర్షిణి, కె.మమత, వి.దుర్గాదేవి, పి.మహాలక్ష్మి ఎంపికయ్యారన్నారు. ఈత పోటీలకు అండర్-14 విభాగంలో ఎం.కావేరి, కె.రక్షిత, ఎస్.నిఖిల్, అంగర్-17 విభాగంలో టి.గగన్‌తేజ్, శామ్యూల్ అర్హత సాధించారని తెలిపారు.


కపిలేశ్వరపురంలో కబడ్డీ సాధన చేస్తున్న విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి పోటీలే లక్ష్యం



గతంలో జరిగిన ఎస్జీఎఫ్ క్రీడల పోటీల్లో మూడు సార్లు రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యాను. గతంలో విజయవాడ, తిరుపతిలో జరిగిన పోటీల్లో పాల్గొన్నా. ఈ సారి జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా సాధన సాగిస్తున్నా. మా ఇంటి వద్ద ఉన్న కాలువలోనే ఈత సాధన చేస్తాను. ఈత కొట్టడంలోని మెలకువలను వ్యాయామ ఉపాధ్యాయులు చక్కగా వివరిస్తున్నారు.

- మాతా కావేరి, తొమ్మిదో తరగతి, కపిలేశ్వరపురం

ప్రతిరోజూ సాధన



హ్యాండ్‌బాల్‌లో గతంలో రాష్ట్రస్థాయిలో రాణించి పతకాలు అందుకున్నా. ప్రతిరోజూ నిత్యం రెండు గంటల పాటు సాధన చేయడం వల్లే ఇది సాధ్యమైంది. తాజాగా హ్యాండ్‌బాల్ జిల్లా మూడో స్థానంలో నిలిచి, రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాను. నెట్ బాల్ క్రీడలోనూ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యా. ఆ పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తా.

- ఎస్.సూర్యకుమార్, తొమ్మిదో తరగతి, కపిలేశ్వరపురం

సౌకర్యాలు కల్పించాలి



ఈతపై మక్కువతో సాధన ప్రారంభించా. కొత్తగా ఈ ఏడాదే పాఠశాలలో చేరినా నన్ను ఉపాధ్యాయులు ప్రోత్సహించి పోటీలకు తీసుకెళ్లారు. తొలిసారిగా రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యాను. దగ్గరలో స్విమ్మింగ్ పూల్స్, శిక్షకులు అందుబాటులో లేక కాలువలు, చెరువుల్లోనే సాధన చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి సౌకర్యాలు కల్పిస్తే మరింతగా రాణించే వీలుంటుంది.

- టి.గగన్‌తేజ్, తొమ్మిదోతరగతి, తాతపూడి

ప్రతిభ మెరిసి.. సృజన విరిసి

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం స్థానిక డాక్టర్ పాలడుగు సత్యవతి,చంద్రమౌళి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభ పాటవ పోటీల్లో విద్యార్థులు తమ సృజనకు పదును పెట్టారు. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభాలు, నష్టాలు ఏమిటి, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో 8,9,10 తరగతి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో పాల్గొన్న 10వ తరగతి విద్యార్థిని కందుల ఐశ్వర్య మొదటి బహుమతి, 9వ తరగతి విద్యార్థిని రెడ్డి అభిజ్ఞవీరమణి ద్వితీయ బహుమతి, 8వ తరగతి విద్యార్థిని కె.రోజా అక్షయ కుమారి తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు ఈనాడు సమకూర్చిన బహుమతులను ప్రధానోపాధ్యాయుడు వేదంపూడి వెంకట కనక మందేశ్వరరావు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు కె. అన్నపూర్ణ, ఎం.రామకృష్ణ, ఆర్. బుల్లియ్య, టి.ఎల్ కనకదుర్గ, ఆర్ఎన్‌వీఎల్ఎం కామేశ్వరి, ఎన్. దీప్తి, ఎస్తేరు వ్యవహరించారు.


ప్రతిభ పాటవ పోటీలో పాల్గొన్న విద్యార్థులు


బహుమతులు సాధించిన విజేతలతో ఉపాధ్యాయులు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

అంగర, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి, అంగర గ్రామాల్లో పర్యటించారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా వెదురుమూడిలో ఉపాధి హామీ నిధులు రూ. 25లక్షలతో చేపట్టనున్న సీసీ రహదారులకు భూమి పూజ చేశారు. అంగరలో 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో నిర్మించతలపెట్టిన రోడ్లకు శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మూతపడి ఉన్న ఆర్వో ప్లాంటు మరమ్మతులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చే దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా తెదేపా అధికార ప్రతినిధి పుట్టల శ్రీనివాస్, ఎంపీపీ రత్నకుమారి, జోగం నాగిబాబు, ఇళ్ల రాంబాబు, అంగర సర్పంచి వాసా కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


వెదురుమూడిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఆసుపత్రి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

మండపేట: మండపేటలో అసంపూర్తిగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పనులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళిక తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కౌన్సిలర్ యరమాటి గంగరాజు, మల్లి పూడి గణేష్ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

మండపేట: ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న ముగ్గురికి ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 3,59,416 చెక్కులు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మండపేట తెదేపా క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. రాయవరం గ్రామానికి చెందిన పట్నాల నాగలక్ష్మికి రూ. 1,08,100, కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన నాగలక్ష్మి రూ. 1,23,116, సుంకర మహాలక్ష్మి రూ. 1,28,200 అందజేశారు.

'మంత్రి సుభాష్‌ను విమర్శిస్తే సహించం'

రామచంద్రపురం: వైకాపా రామచంద్రపురం పార్టీ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్‌కు మంత్రి సుభాష్‌ను విమర్శించే నైతిక హక్కు, అర్హత లేదని ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని కూటమి పార్టీ నియోజకవర్గ నాయకులు కాటే సుబ్రహ్మణ్యం, టేకిమూడి సత్యనారాయణ, దొంగ శ్రీధర్, గుబ్బల ఏసురాజు, ద్రాక్షారామ సర్పంచి కొత్తపల్లి అరుణ తదితరులు పేర్కొన్నారు. రామచంద్రపురం తెదేపా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి సుభాష్‌కు సూర్యప్రకాష్ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. దళితులకు అన్యాయం చేసింది వైకాపా ప్రభుత్వమేనని అన్నారు. దళిత యువకుని కుటుంబం పక్షాన మంత్రి సుభాష్ నిలబడి న్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కట్ట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

మండపేట: మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి బుధవారం డంపింగ్ యార్డు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న యార్డులో జేసీబీతో చదును చేసే పనిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు సూచనలు చేశారు. ఆమె వెంట కమిషనర్ టివి రంగారావు, సిబ్బంది ఉన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్, కమిషనర్

చినుకు పడితే బురదే



ఈ చిత్రం చూస్తే ఇదేదో పుంత గట్టు అనుకుంటున్నారా... అదేం కాదు యర్రపోతవరం నుంచి రాళ్లగుంటకు వెళ్లే వారికి ఇదే ప్రధాన రహదారి. సుమారు ఐదేళ్లుగా ఈ రహదారి ఇలాగే ఉండి ప్రజలను చాలా ఇబ్బంది పెడుతోంది. స్థానికులు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా కూడా తమ రహదారి పరిస్థితి మారలేదని చెబుతున్నారు. ఏ మాత్రం చిన్న చినుకు పడినా కూడా ఈ రోడ్డు అంతా బురదమయంగా మారిపోతోంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని తమ గ్రామ ప్రధాన రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పామర్రు

పొరపాట్లను సరిదిద్దడానికే గ్రామసభలు

అంగర, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వేలో పొరపాట్లు జరిగాయని, వాటిని సరిదిద్దడానికే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రికలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. రైతుల నుంచి స్వీకరించిన అర్జీలను గడువు తేదీలోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం కోరుమిల్లి గ్రామానికి ఇద్దరికి రూ.2.51 లక్షలు విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ చిన్నారావు, సర్పంచి తిరునాతి ఆదిలక్ష్మి, పెద్దిరెడ్డి తమ్మయ్య, కృష్ణ, కొమ్మిశెట్టి రాంబాబు, వంగా శ్రీను, పాల్గొన్నారు.

ద్వారపూడి: ద్వారపూడిలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. 16 వినతులు రెవెన్యూ అధికారులు స్వీకరించారు. తెదేపా మండల శాఖ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, ఆర్ఐ పి.వాసంతి, సర్వేయర్ సుజాత, వీఆర్వో బాపూజీ పాల్గొన్నారు.


హసనబాదలో మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటేశ్వరరావు

ద్రాక్షారామ: హసనబాదలో రీ సర్వే భూ సమస్యల పరిష్కార వేదిక సభలు నిర్వహించారు. తహసీల్దారు వెంకటేశ్వరరావు , సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు, జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, వీఆర్వో సత్తిబాబు పాల్గొన్నారు.

పామర్రు: యండగండిలో భూముల రీ సర్వేలోని సమస్యల పరిష్కారానికి బుధవారం సమావేశం జరిగింది. ఎంపీపీ పంపన నాగమణి మాట్లాడుతూ రైతులు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు కడలి సూర్యకుమారి, మండల సర్వేయరు పావని, వీఆర్వో పామర్తి బాబి పాల్గొన్నారు.


ద్వారపూడిలో అధికారులకు వినతి అందజేస్తున్న రైతు


మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

ఉపాధి పనుల గుర్తింపు

అంగర: కపిలేశ్వరపురం మండలం నల్లూరు, టేకి గ్రామాల్లో బుధవారం ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. 2025- 26 సంవత్సరంలో చేపట్టబోయే పనులను గ్రామసభలో గుర్తించారు. పంటబోదెలు, మురుగునీటి కాలువల పూడికతీత పనులు చేపట్టడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఉపాధిహామీ సాంకేతిక సహాయకుడు లోవరాజు అన్నారు. సర్పంచులు కుక్కల నాగమణి, కురుపూడి ఉదయశ్రీ, జి.మధుకుమారి, ముత్యాల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

వెదురుపాకలో అన్నదానం

రాయవరం, న్యూస్‌టుడే: దేవి నవరాత్రులు ముగింపు సందర్భంగా రాయవరం మండలం వెదురుపాక దేవి సెంటరులో బుధవారం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో వెదురుపాక, నదరుబాద, వి.సావరం, ఆరిక రేవుల, కొంకుదురు, రాయవరం గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

వార్డు సభ్యుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగరలో ఒకటో వార్డు సభ్యుడు శివుడు గంగాధరం ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులను జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ బుధవారం పరామర్శించారు.

స్థానిక సమరానికి కార్యకర్తలు సిద్ధం కావాలి

రామచంద్రపురం: కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా రాబోయే స్థానిక సంస్థల సమరానికి కార్యకర్తలు, నాయకులంతా సిద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పిలుపునిచ్చారు. రామచంద్రపురం ఆర్.ఆర్ గ్రాండ్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కోట శ్రీనివాసరావు అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పదవులను విస్తరించి పార్టీని మరింత బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరూ ముందుకు నడవాల్సి ఉందన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆర్.డి.ఖాన్, కె.గంగవరం మండల అధ్యక్షులు ఉదయ్‌కుమార్, కొప్పిశెట్టి రామకృష్ణ, పాల్గొన్నారు.


కొండేటి చిట్టిబాబును సత్కరిస్తున్న నాయకులు

గణితంలో పట్టు సాధించాలి

ద్వారపూడి, న్యూస్‌టుడే: గణితంలో పట్టు సాధిస్తే ఏ రంగంలోనైనా విజయం సొంతం అవుతుందని మండపేట మండలం వెలగతోడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న చోడే కృష్ణమూర్తి 60 మంది 10వ తరగతి విద్యార్థులకు గణిత ఫోరమ్ రూపొందించిన గణిత దీప్తి స్టడీ మెటీరియల్ పుస్తకాలను బుధవారం ఉపాధ్యాయులు చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉంగరాల వీరభద్రరావు, సొంటేని శ్రీనివాసరావు, ఆలీ, శ్రీనివాసు, సహదేవుడు, షఫీరు, సాయిబాబు, జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

భాజపా సభ్యత్వాల నమోదు

ద్వారపూడి: భాజపా సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగంగా బుధవారం మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లి గ్రామంలో మండపేట నియోజకవర్గ సమన్వయ కర్త కోటిపల్లి సాయిరామ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సభ్యత్వాలు నమోదు చేశారు. దేశ వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని కార్యకర్తలందరూ సహకరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సాయిరామ్ కోరారు. మండపేట నియోజకవర్గ ఉపసమన్వయ కర్త కంకటాల మురళీకృష్ణ, బండారు సూరిబాబు, వాడ్రాసి గౌతమి, గొర్రెల దేవి, తుమ్మలపల్లి ఈశ్వరి, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.



ద్విచక్రవాహన చోరీ దొంగ అరెస్టు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం కుందూరులో ఆగస్టు,2023లో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన ఇంటి సురేంద్రను బండితో సహా బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జానీబాషా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కుందూరుకు చెందిన గుత్తుల వెంకట పవన్ తన స్నేహితుడు మణికంఠ నుంచి తెచ్చుకున్న బైక్‌ను ఇంటి ముందు తాళం వేసి ఉంచాడు. తెల్లవారుజామున ఆరుగంటలకు చూసుకోగా అది కనబడలేదు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న కేసును ఎస్సై బాషా, పోలీసులు ఈశ్వరరావు, సతీష్, లక్ష్మణ్‌బాబు, కామేశ్వరరావు బృందంగా ఏర్పడి విస్తృతంగా గాలించారు. ప్రత్యేక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కాకినాడ గాంధీనగర్‌కు చెందిన ఇంటి సురేంద్ర(20) అనే యువకుడు చోరీ చేసినట్లు గమనించారు. అతన్ని మంగళవారం రాత్రి బైక్‌తో సహా పట్టుకుని అరెస్టు చేశారు. బుధవారం రామచంద్రపురం కోర్టుకు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

ఒళ్లూ.. బళ్లూ గుల్ల


భారీ గుంతలతో కేశవరం కెనాల్ రహదారి

న్యూస్‌టుడే, ద్వారపూడి

గత వైకాపా ప్రభుత్వం రహదారుల అభివృద్ధి పూర్తిగా విస్మరించడంతో మండపేట మండలంలోని 45 కిలోమీటర్ల మేర రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. మండలంలోని ద్వారపూడి, కేశవరం, ఇప్పనపాడు, మెర్నిపాడు, ఏడిద తదితర గ్రామాల రహదారులు భవనాల శాఖకు చెందిన రహదారులు పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి లోతు తెలియక ప్రయాణం నరకంగా మారుతుందని వాహనచోదకులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మండలంలోని రహదారులు మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణం జరుగుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మండపేట మండలం కేశవరం నుంచి సామర్లకోట వెళ్లే ప్రధాన కెనాల్ రహదారి అధ్వానంగా మారడంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రహదారి పూర్తిగా ఛిద్రమైంది. తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన నగరాలైన రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలను కలిపే మార్గం కావడంతో ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి. భారీ గుంతలు ఏర్పడటంతో వాటిని తప్పించే క్రమంలో వాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. రెండు నెలల క్రితం ఈ రహదారిపై పలు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో స్పందించిన ర.భ.శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తరచూ కురుస్తున్న వర్షాలకు మళ్లీ రహదారి గుంతలమయమైంది. ✦ మండపేట నుంచి ఏడిద వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. భారీ గుంతలు ఏర్పడి ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. మండపేట నుంచి రెండు కిలోమీటర్లు ఉండే ఈ రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ మధ్యకాలంలో సుమారు 20 నుండి 30 ప్రమాదాలు జరిగాయని స్థానికులు తెలియజేస్తున్నారు. ✦ ఇప్పనపాడు నుంచి మెర్నిపాడు వెళ్లే రహదారి రాళ్లు పైకిలేచి అధ్వానంగా మారడంతో చోదకులు ఇబ్బందుల అన్నీ ఇన్నీ కావు. నిత్యం ఈ రహదారిలో మండపేట పాఠశాలలకు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో సంబంధిత అధికారులు కనీసం మరమ్మతులు చేయకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.


రాళ్లు పైకిలేచి ప్రమాదకరంగా ఏడిద రహదారి

మరమ్మతులు చేపడతాం..

ద్వారపూడి అయ్యప్ప ఆలయం నుంచి కేశవరం చివరి వరకు రూ. 40 లక్షలు మరమ్మతులు నిమిత్తం మంజూరయ్యాయి. ఏడిద, మెర్నిపాడు రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. వచ్చే నెల 1న మరమ్మతుల పనులు మొదలుపెడతాం.

- సూర్యనారాయణ, రహదారులు భవనాల శాఖ డీఈ

గర్భిణులకు వైద్య సేవలు

అంగర: కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ ఆవరణలోని బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నూతనంగా నిర్మించిన అదనపు భవన సముదాయంలో బుధవారం ప్రసూతి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్టు డా. కె.కన్యాకుమారి 32 మందికి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. రత్నకుమరి, ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ రామారావు, టి.మేరీమణి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.